

## వరలక్ష్మీ నమోస్తుతే..!

మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించే వరలక్ష్మీ వ్రతానికి ప్రతి ఇల్లు సిద్ధమైంది. సౌభాగ్యం, అష్ట ఐశ్వర్యాలు, ఆయురారోగ్యాల కోసం ఈ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీ. ఏలూరు జిల్లాలోని అన్ని ప్రాంతాలతో పాటు నూజివీడు, కైకలూరుల్లో సందడి నెలకొంది.

## పూలు, పండ్ల ధరలకు రెక్కలు



వరలక్ష్మీ వ్రతం సందర్భంగా జిల్లాలోని మార్కెట్లన్నీ కిటకిటలాడాయి. వస్త్రాలు, బంగారం షాపులతో పాటు పూలు, పండ్ల దుకాణాలు కిక్కిరిశాయి. వాటి ధరలకు రెక్కలు వచ్చాయి. అరటి పళ్లు డజను రూ.50 నుంచి వంద రూపాయలు పలికింది. చామంతి పూలు కిలో రూ.600 నుంచి రూ.700 వరకు పలికింది. ఇరవై రూపాయలు ఇస్తే నాలుగైదు పువ్వులు ఇచ్చారు.

## బంగారం కొంటున్నారా.. ?



వరలక్ష్మీ వ్రతానికి ప్రతి ఇంట కొద్దిగానైనా బంగారం కొనడం ఆనవాయితీ. ఈ క్రమంలో కొందరు వ్యాపారులు రకరకాల ఆఫర్లతోను, నాణ్యమైన బంగారం పేరిట మోసం చేసే అవకాశాలున్నాయి. అదేమిటో చూడండి.. 7లో.

# పొలిటికల్ వార్



తెల్లం బాలరాజు
అబ్బయ్య చౌదరి
మేకా ఈశ్వరయ్య



చిర్రి బాలరాజు
చింతమనేని ప్రభాకర్
రోషన్ కుమార్

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అగ్గి రాజుకుంది. ఒకదాంట్లో కూటమి పక్షాల మధ్య ఓపెన్ ఫైర్. మరో రెండు నియోజకవర్గాల్లో టీడీపీ వర్సెస్ వైసీపీ. నువ్వా నేనా అంటూ పరస్పర సవాళ్లు. పోలవరం ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే బాలరాజుల మధ్య బాహాటంగానే మాటల తూటాలు పేలుతున్నాయి. దెందులూరు నియోజకవర్గంలో గడిచిన కొద్ది మాసాలుగా టీడీపీ, వైసీపీ మధ్య హోరాహోరీ సాగుతోంది. కొల్లేరు చేపల చెరువుల లీజుకు సబంధించి తాజా మాజీల మధ్య వార్ నడుస్తోంది.. చింతలపూడి నియోజకవర్గంలో సొసైటీల్లో త్రిసభ్య కమిటీల వ్యవహారం రచ్చకెక్కుతోంది. తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని జనసేన విరుచుకుపడుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే రోషన్ కుమార్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతిప్రతినిధి)

- పోలవరంలో ఆరోపణల అగ్గి
  ఎమ్మెల్యే చిర్రి, మాజీ ఎమ్మెల్యే మధ్య మాటల యుద్ధం
- దెందులూరులో లీజు చిచ్చు
  ఎమ్మెల్యే చింతమనేని వర్సెస్ అబయ్యచౌదరి
- చింతలపూడిలో సొసైటీల రచ్చ
  ఎమ్మెల్యే రోషన్‌పై మేకా ఆగ్రహం
- మండుటెండల్లో మరుగుతున్న రాజకీయం

### చిచ్చు రేపిన ఫోన్ సంభాషణ లీకేజీ

పోలవరం నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, వైసీపీ మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజుల మధ్య ఇప్పుడు రాజకీయ పోరు నడుస్తోంది. అవినీతి ఆరోపణలతో మాటలు, తూటాలు పేలుతున్నాయి. ఏడాది కాలంలో కోట్లు మేసేశారని ఒకరు, ఇరవై ఏళ్లలో మీరేమైనా తక్కువ తిన్నారా అంటూ ఇంకొ కరు వాగ్బాణాలు. ఇద్దరి నేతల మధ్య జరిగిన ఫోన్ సంభాషణ లీకేజీ ఇప్పుడు ఈ వివాదానికి ఆజ్యం పోస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే చిర్రి బాలరాజును ఉద్దేశించి ఇద్దరి నేతల మధ్య సాగిన ఫోన్ సంభాషణ ఒకరి కారణంగా లీకైంది. కూటమి భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన మధ్య తొలుత ఇది అగ్గి రాజేసింది. ఆ మరుక్షణమే మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కూడా రంగంలోకి దిగి సిట్టింగ్ ఎమ్మెల్యేపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దీనికి ప్రతిగా ఎమ్మెల్యే చిర్రి కూడా ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. 20 ఏళ్లు ఎమ్మెల్యేగా చేసిన వారిని నేను కాదా.. ఓడించిందంటూ నేరుగానే విరుచుకుపడ్డారు. పోలవరం నియోజకవర్గంలో జనసేన, వైసీపీ పక్షాల మధ్య గడిచిన వారం రోజులుగా ప్రకటనల యుద్ధం కొనసాగుతోంది. జనసేన నాయకత్వం కూడా దీనిపై దృష్టి పెట్టింది. జరుగుతున్న పరిణామాలను తాజాగా ఆరా తీస్తోంది. ఈ నేపథ్యంలో అసలు ఒకరిద్దరి మధ్య జరిగిన ఫోన్ సంభాషణ లీక్ చేసింది ఎవరన్న దానిపై ఫోకస్ చేయాల్సి ఉండగా, మరోవైపు వైసీపీ దీనిని రాజకీయం చేయడానికి మరింత ప్రయత్నించింది. కూటమి పార్టీల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు ఈ నియోజకవర్గంలో కొనసాగుతున్నాయి. తెలుగుదేశం నాయకత్వం కూడా తాజా పరి స్థితులను ఆరా తీస్తోంది. సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే దేవినేని ఉమ ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ కావడం, అది కాస్త వివాదానికి దారితీయడమే దీనికి కారణం.

### అబ్బయ్యా.. ఇదేందయ్యా !

దెందులూరు నియో జకవర్గంలో గడిచిన కొద్ది మాసాలుగా టీడీపీ, వైసీపీ మధ్య హోరాహోరీ సాగుతోంది. టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మధ్య దీర్ఘకాలికంగా పొలిటికల్ వార్ నడుస్తోంది. కొల్లేరులో చెరువులు లీజులకు తీసుకుని అక్కడి వారికి చెల్లిం చాల్సిన కోట్ల రూపాయలు ఎగవేతకు ప్రయత్నించడం, ఆపై రాజకీయం చేయడంతో అబ్బాయిపై చింతమనేని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. లీజు చెల్లించేంత వరకు వదిలి పెట్టేది లేదని గట్టి వార్నింగే ఇచ్చారు. మాకు అంత గతి పట్టలేదని లీజు సొమ్ము విషయం కేవలం రాజకీయమేనని అబ్బయి చౌదరి వాదన వినిపిస్తున్నారు. శ్రీపర్రు, ప్రత్తికోళ్లలంక చేపల చెరువు చెరువులను లీజుకు తీసుకుని ఆ మేరకు లీజు సొమ్మును కొల్లేరు వాసులకు చెల్లించకుండా ఎగ్గొట్టారంటూ కొంతకాలంగా కొల్లేరు వాసులు ఆయన నివాసం ఎదుట ధర్నాలకు దిగుతూనే ఉన్నారు. ఆఖరికి ఏలూరులో పోలీస్ స్టేషన్ కూడా ధర్నాకు తావిచ్చింది. వీరికి మద్దతుగా ఎమ్మెల్యే చింతమనేని సైతం పేదవర్గాలకు న్యాయం జరగాల్సిందేనని, లీజు సొమ్ము వ్యవహారం తేల్చాల్సిందేనని - మిగతా 8లో..

## నూజివీడు అభివృద్ధికి రూ.30 కోట్లు

### మంత్రి కొలుసు పార్థసారథి



నూజివీడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.30 కోట్లు మంజూరయ్యాయని మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాలువలు, చెరువు పనులకు రూ.22 కోట్లు, నూజి వీడు పట్టణా భివృద్ధికి రూ.5 కోట్లు, బలివే ఆలయ అభివృద్ధికి రెండున్నర కోట్లు మంజూరయ్యా యన్నారు. త్వరలో పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. పోలవరం ప్రాజెక్టు లెఫ్ట్ మెయిన్‌కెనాల్ పనులు నవంబర్‌లో పూర్తి అవుతాయని, రైట్ మెయిన్ కెనాల్ పనులు 2027కి పూర్తి చేస్తారని తెలిపారు. చింతలపూడి పథకానికి అడ్డంకిగా ఉన్న లీగల్ సమస్యలను త్వరలో తొలగించి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయటానికి పనులు జరుగుతున్నాయన్నారు. కృష్ణానది నుంచి వృథాగా సముద్రంలో కలుస్తున్న జలాలను వాటా లేకపోయినా ఏపీలోని పంట సాగుకు అనుమతి కోరగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి బట్టివిక్రమార్క సానుకూలంగా స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఎన్ఆర్ ఈజీఎస్ పనుల బిల్లులు చెల్లించలేదని, వాటి కోసం ఈనెల 11వ తేదీలోపు బిల్లులు ఆన్‌లైన్ చేసుకోవాలని నెలాఖరుకు బిల్లులు చెల్లిస్తామని మంత్రి అన్నారు. గతంలో అర్బన్ , రూరల్ పరిధిలో నిర్మించిన గృహాలకు కొన్ని సమస్యల కారణంగా బిల్లులు చెల్లింపు జరగలేదని కేంద్రమంత్రితో మాట్లాడి త్వరలో బిల్లులు జమ చేస్తామన్నారు. నూజివీడు పట్టణాభివృద్ధికి మంజూరైన రూ.5 కోట్లు నిధులు ఒక్కో వార్డుకు 15 నుంచి రూ.20 లక్షల వరకు సర్దుబాటు చేస్తామన్నారు.

## బాలలతో పని చేయించకండి

### ఆక్వా కల్చర్‌పై వెట్రిసెల్వి సమావేశం



ఏలూరు టూటౌన్, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): రొయ్యల ప్రోసెసింగ్ యూనిట్‌లో బాల కార్మికులు పని చేయకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఆక్వా కల్చర్ యూనిట్‌కు సంబంధించి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మహిళా కార్మికులు పనికి సంబంధించి సంక్షేమ నిబంధనలు చట్టప్రకారం అమలవుతున్నాయో లేదో అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. ఆక్వా ప్రీ ప్రోసెసింగ్, ప్రెస్సింగ్ యూనిట్స్‌లో కార్మికులు సంక్షేమం పట్టించుకుంటున్నారో లేదో పరిశీలించాలన్నారు. అంతర రాష్ట్ర వలస కార్మికుల పిల్లలు బడిబయట ఉన్నట్లు అయితే వారిని గుర్తించి పాఠశాలల్లో నమోదు చేయించాలన్నారు. రొయ్యల సాగులో నిషేధిత యాంటీ బయోటిక్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు. సంయుక్త కార్మిక కమిషనర్ కే.రాణి, ఉప కమిషనర్ శ్రీనివాస్, మత్స్య శాఖాధికారి నర్సయ్య, పరిశ్రమల శాఖాధికారి సుబ్రహ్మణ్యేశ్వర రావు, కాలుష్య నియంత్రణ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



గుడివాడ- ముదినేపల్లి రూటులో మల్లాయపాలెం రైల్వే గేటు మూసివేతపై ఏర్పాటు చేసిన బోర్డు

## నేటి నుంచి మల్లాయపాలెం రైల్వే గేటు మూత

ముదినేపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ-ముదినేపల్లి జాతీయ రహదారిలో మల్లాయపాలెం రైల్వేగేటును మరమ్మతు పనుల కోసం ఈ నెల 8 నుంచి 22 వరకు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటిస్తూ గేటు వద్ద గురువారం బోర్డు ఏర్పాటు చేశారు. ఈ 15 రోజులు వాహనాల మళ్లింపు ఎలా అని పోలీసు, ఆర్టీసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.దీంతో గుడివాడ నుంచి ముదినేపల్లి మీదుగా భీమవరం ఆపై ప్రాంతాలకు, బంటుమిల్లి మీదుగా నరసాపురం తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలను ఎలా మళ్లించాలన్న విషయమై పోలీసు అధికారులు తర్జన భర్జన పడుతున్నారు.గుడివాడ నుంచి ముదినేపల్లి వరకు వాహనాలను మళ్ళించే ఏర్పాట్లు చేస్తే అక్కడి నుంచి అన్ని రూట్లకు వాహనాలు వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది. ముదినేపల్లి, కైకలూరు, బంటుమిల్లి ప్రాంతాలకు వాహనాలను ఏ రూటులో మళ్లించాలన్నది సమస్యగా మారింది. నాలుగు రోజులు ముందుగా తమకు చెప్పిన వాహనాలను మళ్లింపుపై నిర్ణయం తీసుకునేందుకు అవకాశం ఉండేదని, ఇప్పటికిప్పుడు గేటు మూసివేత ప్రకటించడంతో తాము ఇరకాటంలో పడ్డామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. అయితే గుడివాడ నుంచి దొండపాడు, మోటూరు మీదుగా ముదినేపల్లి వెళ్లేందుకు, కార్లు, చిన్న వాహనాలను, గుడ్లవల్లేరు మీదుగా బస్సులు, ఇతర పెద్ద వాహనాలను, సిద్ధాంతం, చౌటపల్లి మీదుగా కొత్త బైపాస్ ద్వారా ముదినేపల్లి రూటుకు వాహనాలను మళ్లించాలన్నది ప్రాథమికంగా నిర్ణయించామని గుడివాడ రూరల్ సీఐ సోమేశ్వర రావు తెలిపారు. ఏ రూటు అయితే రాక పోకలకు ఇబ్బంది లేకుండా ఉంటుందన్నది ఆలోచిస్తున్నట్లు తెలిపారు.

## ఆలయ ట్రస్ట్ బోర్డులకు జాప్యమెందుకో ?

- దరఖాస్తుల సమర్పణకు ముగిసిన గడువు
- ఇప్పటికి విడుదలైంది ఎనిమిది కమిటీలే
- దసరాకైనా పూర్తికావడం అనుమానమే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి): దేవుడు వరం ఇచ్చినా పూజారి వరమివ్వని చందంగా తయారైంది.. ఏలూరు జిల్లాలో దేవాలయాలకు పాలక మండళ్ల ప్రకటన తంతు. ఏడాది పాలన పూర్తయిన తర్వాత ప్రభుత్వం ఆలయ పాలకమండళ్ల ఏర్పాటుకు జూలై మొదటి వారంలో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఆశావహులు, స్థానిక ప్రముఖులు తెగ సంబర పడ్డారు. తీరా చూస్తే కమిటీల ప్రకటనలో జాప్యం వారిని మరింత ఉత్కంఠకు గురి చేస్తోంది. గత నెలాఖరుతో దరఖాస్తు చేసుకోవడానికి గడువు పూర్తయింది. హిందూవులై ఉండి ఆసక్తి ఉన్న వ్యక్తులు ఆయా ఆలయాల కమిటీల్లో సభ్యులుగా దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటి వరకు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) పరిధిలోని 8 ఆలయాలకు మాత్రమే పాలకవర్గాలను అధికారులు ప్రకటిం చారు. ఏలూరు, నూజివీడు, పోలవరం, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట పరిధిలో ఇవి ఉన్నాయి. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పరిధిలో 157 వరకు ఐదు లక్షల పైబడి ఆదాయం వచ్చే దేవాలయాలుండగా ఇందులో 25 కమిటీలకు మాత్రమే పూర్తి జాబితాలను పరిశీలించి ఉన్నతాధికారులకు సమర్పించి నట్లు సమాచారం. డిప్యూటీ కమిషనర్ పరిధిలో 30 ఉండగా, జాయింట్ కమిషనర్ పరిధిలోని ప్రముఖ దేవాలయాలైన ద్వారకాతిరుమల, కొల్లేటికోట పెద్దింటమ్మ, మద్ది ఆంజనేయస్వామి, జంగా రెడ్డిగూడెం పారి జాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆగిరిపల్లి శోభనాచలేశ్వరుడు తదితర 11కు పైగా ఆలయాల కమిటీల ప్రకటన ఇంకా పూర్తి కాలేదు. మూడు కేడర్లలోనూ పలు సత్రాలు, మఠాలు కూడా కలిసి ఉన్నాయి. అయితే ఈ నెలంతా పండుగలు, వరుస సెలవుల నేపథ్యంలో కనీసం దసరా నాటికైనా కమిటీలన్నీ పూర్తి అవుతాయా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### ఏకాభిప్రాయం కుదరకేనా ?

ఆలయ కమిటీల ఏర్పాటులో కూటమిలోని పక్షాల మధ్య ఏకాభిప్రాయం లేక కొన్ని, మరికొన్ని చోట్ల సభ్యులు దొరకకపోవడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాలకమండలి మొత్తం సభ్యుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు, బ్రాహ్మణ, నాయి బ్రాహ్మణ వర్గాల నుంచి ఉండాలి. ఇందులోనే మరో 50 శాతం మహిళలకు కేటాయించాలి. ప్రధాన అర్చకుడు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా వ్యవహరిస్తారు. ఈయన కాకుండా కమిటీలో మరో బ్రాహ్మణ వర్గానికి చెందిన సభ్యుడు ఉండాలి. మరో వైపు నాయీ బ్రాహ్మణుల కొరత కూడా కమిటీల ప్రకటనల జారీకి జాప్యానికి ఒక కారణంగా చెబుతున్నారు. సభ్యుల కూర్పుతో దరఖాస్తులు సమర్పించాక అధికారులు పరిశీలించి పాలక వర్గాలను ఖరారు చేస్తారు. ఇవేమి లేకుండానే పైనుంచి వచ్చిన జాబితాలోనే పాలకమండళ్లను నియమించడంపైన విమర్శలు వస్తున్నాయి.. దీంతో డివిజన్ల పరిధిలోని దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్లు, ఇతర సిబ్బంది పూర్తిస్థాయిలో దరఖాస్తులపై విచారించి ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తున్నారు. వాటి ఆధారంగా పాలక మండళ్ల ప్రకటనలకు ఉత్తర్వులు వస్తున్నాయి.

### ఆడిట్, ఇతర అవినీతి ఆరోపణలూ..

జిల్లాలో ఇప్పటికే 144 దేవాలయాలకు ఆడిట్ అభ్యంతరాలు ఉన్నాయి. కొన్ని ఆలయాలు, సత్రాలపై అవినీతి ఆరోపణలకు సంబంధించిన కేసులున్నాయి. పోలీస్ కేసులు, ఇతర ఆరోపణలున్నా కమిటీల ప్రకటన జరగదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడ కమిటీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినా పెండింగ్‌లో ఉంచే అవకాశం లేక పోలేదు. జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కూచిపూడి శ్రీనివాస్‌ను 'ఆంధ్ర జ్యోతి' ప్రశ్నించగా వివిధ ఆలయాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది విచారించి పంపుతున్నారు. అన్ని నిబంధనలు పూర్తిచేసిన వాటికి ఉన్నతా ధికారులు కమిటీలను ప్రకటిస్తున్నారు.



## కొత్త రేషన్‌కార్డులు వస్తున్నాయ్..



- జిల్లాలో కొత్తగా మంజూరైనవి 5,478
- మార్పుల కోసం వచ్చిన దరఖాస్తులు 55,490
- ఇందులో అర్హత సాధించినవి 36 వేలు

ఏలూరుసిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందిస్తోంది. కొత్తగా జిల్లాలో రేషన్ కార్డులకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన 5,478 దరఖాస్తులకు సంబంధించి కొత్త రేషన్ కార్డులను మంజూరు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. ఏలూరు జిల్లాకు సంబంధించి మొత్తం 55,490 దరఖాస్తులు వచ్చాయి. పరిశీలనలు జరిపి జిల్లాలో వచ్చిన దరఖాస్తులలో 36 వేల దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించారు. గత ప్రభుత్వ హయాంలో నిబంధనల పేరుతో కార్డులను రద్దు చేశారు. వాహనాలు ఉన్నాయని, విద్యుత్ బిల్లులు 300 యూనిట్లు కన్నా ఎక్కువగా ఉన్నాయనే నెపంతో రేషన్ కార్డులను తొలగించారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ఈ విషయంపై ఆందోళన కూడా చేపట్టింది. ప్రభుత్వం మారటంతో రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కార్డుదారుల కష్టాలను గమనించి ఆ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్త కార్డులు జారీ చేయటానికి ఆదేశాలు ఇచ్చారు. ఆ రకంగా గత మేనెల 14 వతేదీ నుంచి ఏలూరు జిల్లాలోని సచివాలయాల పరిధిలో రేషన్ కార్డుల కోసం ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. కొత్తగా వివాహమైన వారు, ఇప్పటివరకు రేషన్ కార్డులు లేని వారు, ఇప్పటికే కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ తప్పుగా నమోదు అయినవారు, అడ్రస్ మారిన వారు, ఇలా ఏడు రకాల సేవలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది.

### ఆగస్టు 25 నుంచి డిజిటల్ కార్డులు

జిల్లాలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డులను ఈనెల 25 వతేదీ నుంచి మంజూరు చేయనున్నారు. వీటితో పాటుగా ప్రభుత్వం ఇటీవల వివిధ సర్వీసులకు సంబంధించి రేషన్ కార్డుల్లో మార్పులు చేయగా వాటికి కూడా కొత్తగా డిజిటల్ కార్డులు వచ్చే అవకాశాలున్నాయి. ఏటీఎం కార్డుల మాదిరిగా క్యూఆర్ కోడ్‌తో ఈ కార్డులను ఇవ్వనున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 6 లక్షల 20 వేల రేషన్ కార్డులున్నాయి.

## దంచికొట్టిన వాన.. పొంగిన కొండవాగులు



కొండవాగు దాటుతున్న ఆర్టీసీ బస్సు

బుట్టాయగూడెం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ అటవీ ప్రాంతంలో గురువారం సాయంత్రం వర్షం దంచికొట్టడంతో కొండ వాగులు పొంగాయి. రెడ్డిగణపవరం-రామారావుపేట సెంటరు మధ్య ఉన్న జల్లేరు కొండవాగుతో పాటు ఏజెన్సీలోని పలువాగులు పొంగడంతో వాగుల వద్ద ఆర్టీసీ, ఇతర వాహనాలు ఇరువైపులా గంటల తరబడి నిలిచిపోయాయి. అటవీ బయట ప్రాంతాల్లో చిరుజల్లులు మాత్రమే కురవగా అడవి లోపల ప్రాంతాల్లో కుంభవృష్టి కురిసింది. ఇళ్లకు వెళ్లే జనాలు, కూలీలకు తిప్పలు తప్పలేదు.



వాగుకు అటూ ఇటూ నిలిచిన జనాలు

సిరిసంపదలు, భోగభాగ్యాలు కల్గించే వరలక్ష్మీ వ్రతాన్ని శ్రావణ పౌర్ణమి ముందురోజైన ఈనెల 8న శుక్రవారం మహిళలు వైభవంగా నిర్వహించనున్నారు. అమ్మవారు వరాలను అనుగ్రహిస్తారని భక్తుల కోర్కెలను తీర్చే దేవతగా నమ్ముతారు. ఆ రోజున లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే అష్టైశ్వర్యాలు కలుగుతాయనేది భక్తుల నమ్మకం. ధనం, శ్రేయస్సు, సంతానం, ఆరోగ్యం, జ్ఞానం, ధైర్యం, శక్తి, విజయం ఇవన్నీ అష్టలక్ష్ములు రూపంలో మహిళాభక్తులకు అందుతాయని చెబుతారు. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ద్వారకాతిరుమల/ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) :

# రావమ్మా.. వరలక్ష్మి

• అనుగ్రహించి.. వరాలివ్వు తల్లీ..



## నేడే వరలక్ష్మీ వ్రత పూజలు

» ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
» మార్కెట్‌లు కిటకిట

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం పూజలు పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఏలూరు-సత్రంపాడులోని అంబికాదేవి అమ్మవారి ఆలయానికి పంచరంగులతో ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణతో ముస్తాబు చేశారు. మహిళలతో సామూహికంగా వరలక్ష్మీవ్రతాలు జరిపించాలని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మీ, దక్షిణపువీధిలోని బాలా త్రిపుర సుందరీదేవి, మహిషాసురమర్దినిదేవి, అగ్రహారంలోని జ్ఞాన సరస్వతీదేవి, పత్తేబాద తదితర ప్రాంతాల్లో గల ఆలయాలు ముస్తాబయ్యాయి. నరసాపురంలోని కనకదుర్గ, గంటాలమ్మ, కొండాలమ్మ, వనువులమ్మ, దుర్గాభవాని ఆలయాలు ముస్తాబయ్యాయి.



ముస్తాబైన అంబికాదేవి ఆలయం

## మార్కెట్‌లో శ్రావణ సందడి

» భగ్గుమన్న పండ్ల ధరలు

తాడేపల్లిగూడెం/తణుకు/ఆచంట/పెనుగొండ,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, కైకలూరు, నూజివీడు, భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం మార్కెట్లలో గురువారం సాయంత్రం రద్దీ అధికంగా ఉంది. కొనుగోలుదారులతో సందడి వాతావరణం నెలకొంది. పలు రకాలు పండ్లు, పువ్వులు, అరటి పండ్లు వంటి పూజా సామగ్రి ధరలు పెరగడంతో కొనుగోలుదారులు చాలా జాగ్రత్తగా తమ బడ్జెట్‌ను బట్టి అవసరమైనవి కొనుగోలు చేశారు. తణుకు పట్టణంలో ఐదు యాపిల్ కాయలు రూ.100, మూడు దానిమ్మకాయలు రూ.100, నాలుగు బత్తాయిలు రూ.100, నాలుగు వెలగకాయలు రూ.100, ద్రాక్ష కేజీ రూ.120, మారేడు ఒకటి రూ.20, డజను అరటిపండ్లు రూ.100, పది తమలపాకులు రూ.20, పత్రి కట్ట రూ.50, నాలుగు కలువ పువ్వులు రూ.40 చొప్పున విక్రయిస్తున్నారు. తాడేపల్లిగూడెంలో అరటిగెల హోల్‌సేల్‌గానే రూ.200 నుంచి రూ.900కు ధర పలికింది. రిటైల్ వ్యాపారులైతే ఏకంగా డజను అరటిపండ్లు సైజును బట్టి రూ.50 నుంచి రూ.100 వరకు అమ్మారు. కిలో చామంతి రూ.600కు విక్రయించారు. మూర మల్లెపూలు రూ.150 చొప్పున అమ్మకాలు సాగాయి. బెంగుళూరు చామంతులు కిలో రూ.400కు, తెల్ల చామంతి బెంగళూరు రకం ఇదే ధరకు విక్రయించారు. కొబ్బరి కాయల ధరలు పెంచారు. చిన్నకాయ రూ.20, పెద్ద కాయ రూ.30కు అమ్మారు. దానిమ్మ, యాపిల్ వంటి ధరలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఈనెల అంతా ఇదే విధంగా ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. శ్రావణ మాసానికి తోడు వినాయకచవితి పండుగ ఈనెలలోనే రావడంతో వ్యాపారులకు మూడు పువ్వులు ఆరుకాయలు అన్నట్టు ఉంది. పెళ్లిళ్ల కూడా ఈనెలలో భారీగానే ఉన్నాయి. ఈమేరకు ఈనెల మొత్తం పండ్లు, పువ్వుల ధరలు తగ్గవని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. ఆచంట మండలం ఆచంట కచేరి సెంటర్, పెనుగొండ మండలం పెనుగొండ మెయిన్ సెంటర్‌లలో వరలక్ష్మి వ్రత పూజా సామగ్రి కొనుగోలుదారులతో సందడి నెలకొంది. ధరలు ఎక్కువగా ఉండడంతో భక్తులు అంతంతమాత్రంగానే కొనుగోలు చేశారు.



ఆచంట కచేరి సెంటర్‌లో



పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో పండ్లు, పత్రి అమ్ముతున్న వ్యాపారులు

### వ్రత పూజకు శుభ సమయాలు..

వరలక్ష్మి వ్రతం పూజ ఆచరించేందుకు కొన్ని స్థిర లగ్నాలున్నాయని పండితులు చెబుతున్నారు. ఆ సమయాల్లో చేస్తే విశేషమైన శుభఫలితాలు కలుగుతాయని వారు వ్యాఖ్యానిస్తున్నారు. సింహ లగ్న పూజ ముహూర్తం ఆగస్టు 8న ఉదయం 6.54 నుంచి 9.02 గంటల వరకు ఉంటుంది. ఆ సమయంలో కాకుంటే వృశ్చిక లగ్న ముహూర్తం మధ్యాహ్నం 1.19 గంటల నుంచి 3.33 గంటల వరకు చేసుకోవచ్చు. ఆ తరువాత కుంభ లగ్న ముహూర్తమైన సాయంత్రం 7.29 గంటల నుంచి రాత్రి 9.06 గంటల వరకు చేసుకోవచ్చు. సాధారణంగా మనం ఉదయం వేళల్లోనే పూజ చేసుకుంటాం..



నూరువరాల పువ్వు

### వరలక్ష్మి వ్రత ప్రాముఖ్యత ఇదీ :

శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తే అష్టలక్ష్ములకు అర్చన చేసినంత ఫలం సిద్ధిస్తుందని పండితులు చెబుతున్నారు. ప్రతీ ఏటా శ్రావణపౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజునే వరలక్ష్మి వ్రతాన్ని జరపడం సంప్రదాయం. వ్రతం ఆచరించే రోజున వేకువజామునే మహిళలు ఇంటిని రంగవల్లులతో అలంకరించి అమ్మవారిని మనసారా ఆహ్వానిస్తారు. పూజగదిలో మండపాన్ని నిర్మించుకుని బియ్యం పిండితో ముగ్గువేసి దానిపై కలశాన్ని ఏర్పాటు చేయాలి. ఆ తరువాత కలశస్థాపనం చేపడతారు. అనంతరం అమ్మవారిని ఉంచి తెల్లటి దారాన్ని ఐదు లేదా తొమ్మిదిపోగులు తీసుకుని పసుపు రాసి దానికి ఐదు లేదా తొమ్మిది ముడులు వేసి తోరాలను తయారు చేసి ముందుగా వీటిని పూజించాలి. అమ్మవారికి చామంతులు. కలువ, నూరువరహాల పూలతో మహిళలు తమ కుటుంబ శ్రేయస్సు, భర్త ఆరోగ్యం, పిల్లల భవిష్యత్తు కోసం ఎంతో నిష్టతో వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించడం సంప్రదాయం.



తాడేపల్లిగూడెంలోని పువ్వుల దుకాణం వద్ద రద్దీ

## నింగినంటిన పూల ధరలు

ద్వారకాతిరుమల : శ్రావణమాసంలో వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని పూల ధరలు ఒక్కసారిగా నింగినంటాయి. ఈ మాసంలో పూలకు మంచి గిరాకీ ఉంటుంది. గులాబి, చామంతులైతే శ్రీమంతులు మాత్రమే కొనుగోలు చేసే రేంజ్‌లో ఉన్నాయి. నిన్న మొన్నటివరకు కిలో రూ. 200 వరకు ధర దాటని గులాబీలు, చామంతులు, ప్రస్తుతం కిలో రూ.600 నుంచి రూ.700కు చేరింది. ఈ కోవకే మల్లెలు, కనకాంబరాలు చేరాయి. ఎక్కువగా చామంతులు ఈ పూజలో అవసరం కావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వినియోగ దారులు కొనుగోలు చేస్తు న్నారు. బంతి పువ్వులు కిలో రూ.200కు విక్రయిస్తున్నారు. జాజిపూలు మూర రూ.100 పైబడి పలుకుతోంది. మల్లెపూల ధర రెట్టింపయింది. మూర రూ.80వరకు విక్రయిస్తున్నారు. అన్నిరకాల పూల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో కొనేందుకు ఇబ్బందులున్నా వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకునేందుకు మహిళలు సమాయత్తమవుతున్నారు.

### పువ్వుల ధరలు అధికంగా ఉన్నాయి



పువ్వుల ధరలు అధికంగానే ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా కడియంతో పాటు పలు లంక గ్రామాల నుంచి బంతి, చామంతి పువ్వులు తీసుకొచ్చాం. చామంతి పువ్వులు, మల్లెపూల ధరలు మరింత ఎక్కువగానే ఉన్నాయి. అయినప్పటికీ వరలక్ష్మి వ్రత పూజల్లో చామంతులను ఎక్కువగా వినియోగిస్తారు. ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ కొనుగోలుదారులు వాటినే ఎక్కువగా కొంటున్నారు. సాయంత్రం నుంచి వ్యాపారం బాగానే సాగింది.

- ఇంటి సత్యనారాయణ, వ్యాపారి, తణుకు



శ్రీవారు, అమ్మవార్ల వద్ద అంకురార్పణను జరుపుతున్న అర్చకులు

## శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

ద్వారకాతిరుమల,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్షేత్రం చిన్నతిరుమలేశుని ఆలయంలో శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ అంకురార్పణ కార్యక్రమాన్ని ఆలయ యాగశాలలో జరిపి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ముందుగా అర్చకులు యాగశాల వద్ద శ్రీవారు, అమ్మవార్ల మూర్తులను ఉంచి అలంకరించారు. ఆలయ ఆవరణకు పుట్టమన్నును తెచ్చి సిద్ధంగా ఉంచిన పాలికల్లో ఉంచారు. అక్కడ పవిత్రాలను ఉంచి పూజలు చేశారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళవాయిద్యాలు, అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ నవధాన్యాలను పాలికల్లో పోశారు. దీంతో అంకురార్పణ ముగిసింది. అనంతరం మండపారాధన నిర్వహించారు. ఆలయంలో ఏడాదిపొడవునా తెలిసి. తెలియక జరిగిన తప్పుల ప్రాయఃచిత్తం నిమిత్తం ఈ పవిత్రోత్సవాలను నిర్వహించడం పరిపాటి. శుక్రవారం ఆలయంలో పవిత్రాధివాసం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.



అమ్మవారి ఆలయంలో గాజులను దండలుగా గుచ్చుతున్న మహిళలు

## నేడు మావుళ్లమ్మకు లక్ష గాజుల అలంకరణ

» మూడు రోజులపాటు భక్తులకు దర్శనం

భీమవరంటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):మావుళ్లమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన లక్ష గాజులను శుక్రవారం అలంకరణ చేయనున్నారు. భక్తులు అందించిన గాజులను అమ్మవారికి అలంకరించేందుకు మహిళలు భక్తిశ్రద్ధలతో దండలుగా అలంకరణ చేశారు. శ్రావణమాసం మూడు రోజులు అత్యంత పవిత్రమైనవి కావడంతో శుక్రవారం సాయంత్రం సంధ్యాకాల పౌర్ణమి, శ్రావణ పౌర్ణమి శ్రవణ నక్షత్రం, శనివారం శ్రావణ మాసం శ్రవణ నక్షత్రం వేంకటేశ్వర స్వామి వారి తిరునక్షత్రం, ఆదివారం సూర్యనారాయణ ప్రీతికరమైన రోజును పురస్కరించుకుని అమ్మవారిని లక్ష గాజుల అలంకరణలో ఉంచుతామని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధామహాలక్ష్మినగేష్, ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లికార్జునశర్మ తెలిపారు.

## రాష్ట్రీయ బాల పురస్కార్‌కు దరఖాస్తు చేసుకోవాలి

ఏలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ అవార్డులు-2025కు జాతీయ మహిళాభివృద్ధి సంస్థ, శిశు సంక్షేమశాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ న్యూఢిల్లీ వారికి ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బాలల సంరక్షణాధికారి డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పలు రంగాల్లో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన, ప్రతిభ చాటిన బాలలు, యువత 5 నుంచి 18 ఏళ్లలోపు బాలలు వ్యక్తిగతంగానీ, ఏదైనా సంస్థ ద్వారా సాధించిన ప్రతిభకు సంబంధించిన పేపర్ క్లిప్పింగ్స్, ఇతర ఆధారాలతో హెచ్‌టీటీపీఎస్//అవార్డు.జీవో.ఇన్ పోర్టర్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 79015 97267 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## రేపు 'ఏపీ నిట్'లో స్నాతకోత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్ స్నాతకోత్సవ వేడుకలకు ముస్తాబైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న హాజరు కానున్నట్టు రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 9వ తేదీ శనివారం ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుం దన్నారు. ప్రస్తుతం 2021-25 బ్యాచ్‌కు చెందిన 667 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేస్తామన్నారు. వీరితో పాటు పీహెచ్‌డీ పూర్తిచేసిన 29 మంది విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను అందిస్తారన్నారు. ఆయా కోర్సులలో గ్రేడ్ పాయింట్లు సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు, బ్యాచ్‌ల వారీగా అద్భుత ప్రతిభ కనబర్చిన ఒక విద్యార్థికి బంగారు పతకాన్ని అందజేస్తామన్నారు.

### సమాజాభివృద్ధికి వేదాన్ని వినియోగించాలి



సరిపల్లె గ్రామానికి గత 36 ఏళ్లుగా వస్తున్నాను. 1976లో ఇక్కడ నుంచే వేదవిద్యలో పట్టా పొందా. 1989 నుంచి పరీక్షాధికారిగా వస్తున్నా. సమాజాభివృద్ధికి వేదాల్ని వినియోగించాలి. 105 ఏళ్లుగా దేశంలోని వేదపండితులు ఇక్కడ నుంచి వెళ్లినవారే. కాశీ, తిరుమల తిరుపతి, శ్రీశైలం, శ్రీకాళహస్తి, అన్నవరం తదితర క్షేత్రాల్లో పనిచేస్తున్నారు. అలాగే విదేశాలకు వెళ్లిన కూడా వేదపండితులుగా ప్రఖ్యాతి పొందుతున్నారు.

- గుళ్లపల్లి విశ్వనాథ ఘనాపాటి టీటీడీ దేవస్థాన వేదపాఠశాల అధ్యాపకులు, హైదరాబాద్.

### యువతలో మార్పు తీసుకురావాలి



కృష్ణ యజుర్వేదంలో విద్యనభ్యసించి ప్రతీ ఏటా 50మంది విద్యార్థులను తయారు చేశాం. ఇక్కడకు 12 ఏళ్ల నుంచి పరీక్షాధికారిగా వస్తున్నా. శ్రీశైలంలో శ్రీదేవి వేద విద్యాలయంలో పదేళ్ల క్రితం 50 మంది వేద విద్యార్థులను తయారు చేశాం. వేదంలోని సారాన్ని ఎవరూ పాటించకపోవడం దురదృష్టకరం. వేదప్రచారం చేసి యువతలో మార్పు తీసుకురావాలి.

- విష్ణుభట్ల శ్రీకృష్ణ ఘనాపాటి, తెనాలి.



వేదమాతను ప్రార్థిస్తున్న పండితులు, విద్యార్థులు, వేదపరిషత్ నిర్వాహకులు
వేద పరీక్షలు నిర్వహిస్తున్న పండితులు

## వేదాలు అతిప్రాచీన విజ్ఞాన సంపదలు

» సరిపల్లెలో మూడు రోజుల పాటు వేద పరీక్షలు

**దేశ నలుమూలల నుంచి 150 మంది విద్యార్థుల హాజరు**

గణపవరం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): భారతదేశ సంపద వేదాలని, ఇవి అతిప్రాచీన విజ్ఞాన సంపదలని పలువురు వేదపండితులు అన్నారు. గణపవరం మండలం సరిపల్లె సత్యాభివర్ధక నిలయంలోని టీటీడీ కల్యాణ మండపంలో 105వ వేదశాస్త్ర పరిషత్ కార్యక్రమాలు గురువారం వేదమంత్రాల ఘోషతో ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో దేశ నలుమూలల నుంచి వేద విద్యార్థులు వేద పరీక్షల్లో పాల్గొంటున్నారు. తొలిరోజు గురువారం జరిగిన పరీక్షలు పండితుల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఆఖరి రోజు 9వ తేదీన వేదశాస్త్ర సభ నిర్వహిస్తారు. వేద పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు టీటీడీ వారు జారీ చేసిన యోగ్యతాపత్రాలు అందజేస్తారు. ఈ కార్యక్రమం స్థానిక గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గత 31 ఏళ్ల నుంచి టీటీడీ వారి సహకారంతో భోజన, వసతి తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో పాల్గొనేందుకు టీటీడీ ఎస్వీ యూనివర్సిటీ నుంచి రాజస్థాన్, బిహార్, మహారాష్ట్ర, తమిళనాడు, కంచి, కర్ణాటక, తెలంగాణ ఉభయరాష్ట్రాల నుంచి విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. దేశంలోని 48 వేద పాఠశాలల్లో సరిపల్లెలోని వేదపాఠశాలకు ప్రథమ స్థానం దక్కింది. 150 మంది వేదవిద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొంటున్నారు. నిత్యం వేదమంత్రాల ఘోషతో భగవన్నామస్మరణతో, హోమాలు, నిత్యాన్నదానాలతో పునీతమయ్యే పవిత్రభూమి ఈ సరిపల్లె గ్రామంలోని సంఖ్యార్థివర్ధక నిలయంలో గత 105 ఏళ్ల నుంచి ఇక్కడకు ప్రతీఏటా వస్తున్న వేదపండితులు వారి మనోభావాలు ఆంధ్రజ్యోతికి వివరించారు.

### సామాన్యులకు వేదసారాన్ని అందించేందుకు కృషి



సామాన్యులకు వేదసారాన్ని అందించేందుకు కృషి చేస్తున్నాం. వేదాలు కుల, మత బేదాలకు అతీతంగా చేయాలనుకుంటున్నాం. కృష్ణా జిల్లా ఉయ్యూరు మధురపుర గ్రామంలోని వేదపాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్నా. నాలుగు సంవత్సరాలుగా ఇక్కడకు పరీక్షాధికారిగా వస్తున్నా. ఆరుగురు విద్యార్థుల్ని వేదపండితులుగా తీర్చిదిద్దా.

- విష్ణుభట్ల సుబ్రహ్మణ్య ఘనాపాటి.

### సామ వేదాభివృద్ధికి కృషి చేస్తున్నా..



సామ వేదంలో కౌదుమ శాఖ పండితులుగా పని చేస్తున్నా. వేదం లేని ఏ యజ్ఞము యజ్ఞముకాదు. వేదము పారాయణ అవసరం. పది మంది విద్యార్థుల్ని వేదపండితులిగా తయారు చేశాం. బెంగుళూరు. ద్వారకాతిరుమల తదితర ప్రాంతాల్లో పండితులుగా కొనసాగుతూ.. విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. సామవేదం అభివృద్ధికి కృషి చేస్తున్నాను.

- శ్రీకాంతశర్మ, వేద పండితుడు విజయనగరం.





చిట్టూరి ఇంద్రయ్య కాలేజీలో వాకింగ్ ట్రాక్ ప్రాంగణం
సింథటిక్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం →

### త్వరలో పనులు చేపడతాం



కళాశాలలో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు త్వరలోనే చేపడతాం. ఇప్పటికే ట్రాకు నిర్మాణానికి సబంధించి కేంద్రమంత్రి వర్మ ఎంపీ నిధులు నుంచి రూ.30 లక్షలు కేటాయించారు. ఇంకా నిధులు సమకూర్చాల్సి ఉంది. వాటిని కూడా సేకరించే విధంగా చర్యలు తీసుకున్నాం. వచ్చే సెప్టెంబరు లోపుగా పనులు ప్రారంభించి, ట్రాక్ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

- ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్యే, తణుకు

# వాకింగ్ ట్రాక్‌కు మోక్షం !

» తణుకు ఇంద్రయ్య డిగ్రీ కాలేజీలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు నిధుల మంజూరు
» ఇప్పటికే శంకుస్థాపన చేసిన కేంద్రమంత్రి వర్మ
» సెప్టెంబరులో పనులు ప్రారంభించే అవకాశం

తణుకు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణంలో ప్రధానంగా వినిపించే వాకింగ్ ట్రాక్.. చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కాలేజిలో ఉన్న వాకింగ్ ట్రాక్. ఈ ట్రాకు ద్వారా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వందలాది మంది వాకింగ్ చేస్తుంటారు. మరికొంత మంది పలు రకాలు క్రీడలు, జిమ్ పరికరాల ద్వారా వ్యాయామం చేస్తుంటారు. దీనికి బాలారిష్టాలు కూడా చాలా ఉన్నాయి. వాకింగ్ ట్రాక్‌కు అనేక సమస్యలు ఉన్నాయి. ప్రధానంగా ట్రాక్ ఒకప్పుడు చాలా పల్లంగా ఉండేది. దానిని అనేక సందర్భాల్లో దాతలు, వాకర్స్ సభ్యుల సహకారంతో దపదఫాలుగా మట్టితో పూడ్చించారు. ప్రస్తుతం వాకర్స్ కోరికల మేరకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఎంపీ నిధులు నుంచి రూ. 30లక్షలు కేటాయించేలా కృషి చేశారు. గత ఏప్రిల్ మాసంలో మంత్రి శ్రీనివాసవర్మతోనే పనులకు సంబంధించి శంకస్థాపన చేయించారు. పనులు కూడా వచ్చే సెప్టెంబరులో ప్రారంభించే అవకాశం ఉందని చెబుతున్నారు.

### నిత్యం రద్దీగా గ్రౌండ్..

ప్రతిరోజు వాకింగ్ గ్రౌండ్ వాకర్స్‌తో కళకళలాడుతుంటుంది. వాకర్స్‌కు సంబంధించి అసోషియేషన్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. చిన్నచిన్న సమస్యలు పరిష్కరించుకుంటారు. పెద్దవి అయితే ప్రజాప్రతినిధులు, అధికారులు, దాతల ద్వారా పరిష్కరించుకునే సంప్రదాయం కొనసాగుతుంది. రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో వందలాది వాకర్స్ వస్తుంటారు. తణుకు పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వాకర్స్ వస్తుంటారు.

### సింథటిక్ ట్రాక్ ఏర్పాటు..

వాకర్స్ ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులు తొలగిపోయే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. ఎందుకంటే ఇప్పటికే సింథటిక్ ట్రాక్ ఏర్పాటు గత సెప్టెంబరులో శంకుస్థాపన చేశారు. టాక్ పూర్తిస్థాయి ఏర్పాటుకు ఇంకా ఎక్కువ నిధులు అవసరం అవుతుందని, నిధుల వేటలో ఉన్నట్లు చెబుతున్నారు. పనులు ప్రారంభమైతే దాతలు ముందుకు వచ్చే అవకాశం ఉంది. ట్రాకు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలంటే సుమారుగా రూ.70 లక్షల వరకు అవుతుందని అంచనా వేస్తున్నారు. పనులు మొదలు అయ్యాక నిధులు లేమితో ఆలస్యం కాకుండా ఉండాలనే నిధులు కోసం ప్రయత్నాలు జరుగుతున్నట్టు చెబుతున్నారు.

### వాకర్స్‌కు చాలా ఉపయోగం



సింథటిక్ ట్రాక్ నిర్మాణం వల్ల వందలాది వాకర్స్‌కు చాలా ఉపయోగంగా ఉంటుంది. చాలామంది వాకింగ్ కోసం చాలా దూరం నుంచి కాలేజి ఆవరణకు వస్తుంటారు. తగిన సౌకర్యాలు కల్పిస్తే చాలా బాగుంటుంది.

- చీర్ల శ్రీనివాసరావు, పైడిపర్రు

### రాధాకృష్ణ కృషి మరువలేనిది



వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేస్తామని గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగానే సింథటిక్ వాకింగ్ ట్రాకు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే కృషి మరువలేనిది.

- కోడూరి ఆంజనేయులు, తణుకు

### అందరికి అనువుగా ట్రాక్



తణుకు పట్టణానికి మధ్యలో ఉండడం వల్ల అన్ని వయస్సుల వారు వచ్చి వాకింగ్ చేసుకునే విధంగా చాలా అనువుగా ఉంది. అందువల్ల సింథటిక్ ట్రాక్ పూర్తయితే పట్టణంతో పాటు పలు గ్రామాల ప్రజలకు చాలా ఉపయోగపడుతుంది. దీనికి వాకర్స్ నుంచి ఆర్థికంగా సహాయం అందించాలి.

- కల్లూరి స్వరాజ్యలక్ష్మి, తణుకు

## రైల్వే ట్రాఫిక్ నివారణకు ఓవర్ బ్రిడ్జిలు కావాలి

» కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన ఎంపీ మహేశ్



మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి వినతి పత్రం అందిస్తున్న ఏలూరు ఎంపీ పుట్టా

ఏలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో రైల్వే ట్రాక్స్ వద్ద ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం అవసరమని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా రైల్వే మంత్రిని గురువారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ వివరిస్తూ నియోజకవర్గ పరిధిలో 12 ముఖ్యమైన ప్రధాన రైల్వే లెవెల్ క్రాసింగ్‌లున్నాయని, ఇవి అప్‌ల్యాండ్, డెల్టాను కలుపుతూ ఉ న్నందున భారీగా ట్రాఫిక్ ఝామ్‌కు కారణం అవుతున్నాయన్నారు. భీమడో లు లెవెల్ క్రాసింగ్, కైకరం, చేబ్రోలు, ఉంగుటూరు, పవర్‌పేట, పంగిడిగూ డెం, సీతంపేట, పూళ్ల, బాదంపూడి వద్ద ఆర్‌వోబీలు అవసరమని, వట్లూరు రైల్వేగేటు వద్ద అండర్ పాస్ నిర్మాణానికి సంబంధించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇవే కాకుండా నాలుగు ప్రధాన లెవెల్ క్రాసింగ్‌లు ఆటపాక- వరాహ పట్నం, వదర్లపాడు బ్రాంచ్, పల్లెవాడ-రామవరం బ్రాంచ్, కొక్కిర్లపాడు రైస్‌మిల్లు లెవెల్ క్రాసింగ్ వద్ద ఉన్న సమస్యలను మంత్రి వైష్ణవ్‌కు వివరిం చారు. వీటిని ప్రాధాన్యతా క్రమంలో అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు వేగంగా చర్యలు తీసుకుంటామని మంత్రి ఎంపీకి హామీ ఇచ్చారు.

### తప్పుడు ప్రచార వ్యాప్తికి తీసుకున్న చర్యలేవి : ఎంపీ పుట్టా

తప్పుడు సమాచార వ్యాప్తి, నియంత్రణ కోసం కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర, సమాచార, ప్రసార మంత్రి డాక్టర్ మురుగన్ లిఖితపూర్వక సమాచారాన్ని అందించారు. ప్రింట్ మీడియా, టీవీ, డిజిటల్ మీడియాలకు నిబంధనలు ఉన్నాయని మంత్రి వెల్లడించారు.

## అమిత్‌షాను కలసిన 'పాకా'



అమిత్‌షాను కలిసిన పాకా వెంకట సత్యనారాయణ

భీమవరంటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షాను గురువారం రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ మర్యాద పూర్వకంగా ఢిల్లీలో కలిశారు. రాష్ట్ర పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా ఉన్నందున రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, కూటమి పరిపాలన తదితర అంశాలపై ఇరువురు చర్చించుకున్నట్లు తెలుస్తోం ది. ఈ మేరకు జ్ఞాపికను అందించారు. ఆయనతో పాటు సత్యనారాయణ కుమారుడు ధనుంజయ నరసింహమూర్తి ఉన్నారు.

## పుణ్యక్షేత్రాల్లో అంటరానితనం తగదు

» మాజీ ఎంపీ చింతా మోహన్



విలేకరులతో మాట్లాడుతున్న చింతా మోహన్

ఏలూరుటూటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల్లో అంటరానితనం ఉండడం తగదని చిత్తూరు మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. ఏలూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానాల్లో 20, 25 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను అన్యమతస్తుల పేరుతో తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో 20 ఏళ్లుగా నర్సుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి బైబిల్ చదువుతుందనే కారణంతో విధుల నుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. ఏలూరు నగరం 20 ఏళ్ల క్రితం ఎలా ఉందో ఇప్పుడు అలాగే ఉందని అభివృద్ధి కనపడడం లేదన్నారు.

### లిక్కర్ స్కామ్‌లో ఎవరూ తప్పించుకోలేరు..

లిక్కర్ స్కామ్‌లో ఎంతటి పెద్దవాళ్లు ఉన్నా తప్పించుకునే ప్రసక్తేలేదని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. లిక్కర్ స్కామ్‌లో వందల కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్నారు. ఎంతటి వారైన సరే విచారణ జరిపి శిక్షించాలన్నారు. మొలసిస్‌ను అతితక్కువ రేటుకు కొనుగోలు చేసి లిక్కర్ తయారు చేసి వేల కోట్ల రూపాయలు కాజేశారన్నారు.



ఎరువుల యాజమాన్యంపై వివరిస్తున్న గోవిందరాజులు

## సమగ్ర పోషక విలువలపై అవగాహన అవసరం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పోషక విలువల సమగ్ర యాజమాన్యంపై అవగాహన ఉన్నప్పుడే తక్కువ పెట్టుబడి సాధ్యమవుతుందని ఉద్యాన విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకుడు డాక్టర్ గోవిందరాజులు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలో ప్రాథమిక సహకార పరపతి సంఘ సభ్యులకు 15 రోజుల సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎరువుల యాజమాన్యంపై వివరించారు. కార్యక్రమంలో డీసీవో డాక్టర్ రాధాకృష్ణ, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి, శాస్త్రవేత్త పెద్దబాబు, తదితరులు వివరించారు.

## 'జవహర్ నవోదయ'లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు

దెందులూరు,ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):2025-28 ఆర్థిక సంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల ప్రవేశం కోసం దరఖాస్తులు కోరుతున్నామని పెదవేగి లక్ష్మీపురం జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య తెలిపారు, ఆగస్టు పదో తేదీ లోపు జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు



ప్రస్తుతం బంగారం ధర చుక్కల్లో ఉంది. దీంతో పలువురు బంగారం విక్రేతలు వినియోగదారులను పలు విధాలా మోసగిస్తున్నారు. 916 కేడీఎం అంటూ హాల్‌మార్కు చూపి మరీ విక్ర యిస్తున్నారు. తమకు తెలిసిన దుకాణదారులే కావడంతో తాము కొన్న బంగారం నిఖార్సైనదేనని పలువురు వినియోగదారులు నకిలీ బంగారాన్ని కొన్ని మోసపోతున్నారు. కొనుగోలు చేసిన కొన్నేళ్ల తర్వాత దానిని మార్చుకునే సమయం వరకు వినియోగదారులకు తాము దగా పడిన విషయం బయటపడడం లేదు. ఇదే వ్యాపారులకు వరంగా మారింది.

# బంగారం... భలే మోసం!

» ఆఫర్లతో ఒకవైపు.. 916 కేడీఎం అంటూ మరోవైపు
» వినియోగదారులను దగా చేస్తున్న పలువురు వ్యాపారులు



నకిలీ బంగారంతో తయారైన గాజు (ఇన్‌సెట్) నకిలీ బంగారానికి కూడా హాల్ మార్కు వేసిన వైనం

భీమవరం క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో కొన్ని దుకాణాల యజమానులు ఆఫర్లతో ఖాతాదారులకు వల వేస్తున్నారు. మూడు రోజులపాటు ప్రత్యేక ఆఫర్లంటూ దుకాణాల వద్ద బోర్డులు పెట్టడం, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌ల ద్వారా మెస్సేజ్‌లు పంపి మూడు రోజులపాటు ఏ వస్తువు కొనుగోలు చేసినా తరుగు, మజూరీ లేదంటూ చెప్పడంతో కొనుగోలుదారులు ఆయా దుకాణాలకు ఎగబడుతున్నారు. దుకాణాల వద్దకు వెళ్ళాక గాని తెలియడం లేదు వారి మాయాజాలం. కొన్ని వస్తువులకే తరుగు, మజూరీ లేదని అక్కడకు వెళ్ళాక చల్లగా చెబుతున్నారు. దీంతో చేసేదేమీ లేక వారు చూపించిన వస్తువులనే కొనుగోలు చేయవలసి వస్తుంది. ఎక్కువగా వ్యాపారులు రాళ్ళ వస్తువులనే తరుగు, మజూరీ లేకుండా విక్రయాలు చేస్తూ ఉంటారు. ఎందుకంటే రాళ్లల్లో భారీ వ్యత్యాసం రావడంతో వ్యాపారులకు అధిక లాభం చేకూరుతుంది. ఉదాహరణకు ఒక రాళ్ళ వస్తువుకు 25 గ్రాముల రాళ్ళు ఉంటే ఆ వ్యాపారి 15 గ్రాములు మాత్రమే రాళ్ళ తూకం తగ్గిస్తాడు. అంటే మిగిలిన 10 గ్రాములు బంగారు తూకంలో జమ చేసుకుంటాడు. ఆ రకంగా కొనుగోలుదారులు నష్టపోతుంటారు. ఇటువంటి దందాలు జిల్లాలో యథేచ్ఛగా కొందరు వ్యాపారులు చేస్తున్నప్పటికీ అధికారుల దాడులు లేకపోవడంతో వారి పని చాకచక్యంగా సాగిపోతోంది.

### 916 కేడీఎం పేరిట మోసం

బంగారం కొనుగోలు చేసేందుకు కొంత మంది కొనుగోలుదారులు తమకు తెలిసిన షాపుల్లోకి వెళ్ళి కొనుగోలు చేస్తుంటారు. ఆ నమ్మకమే వ్యాపారులకు ధనాలాభంగా మారుతుంది. కొన్ని వస్తువులను 916 కేడీఎం స్టాంప్‌తో విక్రయిస్తారు. అయితే అవి పూర్తిగా 916 కేడీఎం రాకపోవడంతో మార్చే సమయంలో విషయం పూర్తిగా అర్థమవుతుంది. కొంత మంది వ్యాపారులపై నమ్మకంతో హాల్ మార్క్ లేకుండానే వస్తువులు కొనుగోలు చేసుకుని వెళ్ళిపోతూ ఉంటారు. దానిపై 916 కేడీఎం ఉందా, లేదా అనేది మాత్రమే చూసుకుంటారు. వస్తువులు కొన్నేళ్ళ తర్వాత మార్చే సమయంలో అవి మిషన్‌పై పరీక్ష చేయగా 916 రాకపోవడంతో ఖంగుతింటారు. చేసేదేమీ లేక మోసపోయామని నిర్ధారించుకుంటారు. ఆ సమయంలో వస్తువులు చేయించిన దుకాణ యజమాని దగ్గరకు వెళితే తాను 916 కేడీఎం చేయించి ఇచ్చానని చల్లగా చెబుతారు. ఇలా కొనుగోలుదారులు అన్ని విషయాల్లోను నష్టపోతూనే ఉన్నారు.

### హోల్ సేల్ వ్యాపారుల మోసాలిలా..

పశ్చిమలో ఎక్కువగా బంగారం వ్యాపారం సాగుతుంది. జిల్లాలోని భీమవరంతోపాటు నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు వంటి ప్రధాన పట్టణాల్లో బంగారం వ్యాపారం ఎక్కువగా జరుగుగుతుంది. ఈ ప్రాంతాలకు విజయవాడ, మద్రాస్, ముంబాయితోపాటు నరసాపురం నుంచి కూడా హోల్‌సేల్ వ్యాపారులు ఆయా పట్టణాలకు వచ్చి దుకాణాలకు హోల్‌సేల్‌గా బంగారు వస్తువులను విక్రయిస్తూ ఉంటారు. వారు కూడా అందినకాడికి దోచుకోవడం సర్వసాధారణంగా మారింది. మామూలుగా 92 శాతం ఉన్న వస్తువును అదనంగా 3-4 శాతం వేసుకుని విక్రయించాలి. అయితే వారు కొన్ని దుకాణాలను ఆసరాగా చేసుకుని 7 నుండి 8 శాతం వరకు దోచుకుంటున్నారు. ఆ రకంగా వ్యాపారులు కూడా నష్టపోతున్నారు. దీంతో వ్యాపారులు కొనుగోలుదారులపై ఆ భారాన్ని వేయక తప్పడం లేదు. మొత్తానికి కొనుగోలుదారులే నష్టపోతున్నారు.



## వ్యసనాలకు దూరంగా ఉండాలి

హోంగార్డు కమాండెంట్ ఎ. జోషి

ఏలూరు క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలని విశాఖ హోంగార్డ్సు కమాండెంట్ ఎ. జోషి అన్నారు. ఏలూరు జిల్లా హోంగార్డ్సు యూనిట్ తనిఖీలో భాగంగా గురువారం ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ చేరుకుని హోంగార్డ్సు గౌరవ వందనాన్ని స్వీకరించి పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు కల్గి ఉండాలని ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు డ్రైవింగ్ లైసెన్సు ఉండడం వల్ల వచ్చే ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్నారు. హోంగార్డ్సు తమ సేవలను చిత్తశుద్ధితో నిర్వహించి పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. రాజమహేంద్రవరం హోంగార్డ్సు డీఎస్పీ కెఎస్ఎస్ శ్రీనివాసరావు, ఏఆర్‌డీఎస్పీ చంద్రశేఖర్, ఏఆర్‌ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంతో న్యాయం : ఎస్పీ



ఏలూరు క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పోలీస్‌శాఖ నవీన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా బాధితులకు న్యాయం అందిం చేందుకు కట్టుబడి ఉందని జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారులతో నేర దర్యాప్తు, ఆధునిక, సాంకేతిక ఆధారిత టూల్స్ వినియోగంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రప్రథమంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ బోట్ ద్వారా జిల్లా ప్రజల ఫిర్యాదులను ఆడియో, వీడియో రూపంలో స్వీకరించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు పోలీస్ శాఖ ఆధునికత సాంకేతికతతో పని చేస్తోందన్నారు. బాధితులు తమ ఫిర్యాదులను బోట్ ద్వారా చెప్తే అది ప్రామాణి కమైన సమాచారంతో అధికారులకు అందిస్తుందన్నారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు, నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వి ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ హబీబ్‌బాషా పాల్గొన్నారు.




ఏలూరులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

## నేతన్నకు అండగా నిలవాలి

చేనేత దినోత్సవంలో నేతలు, అధికారులు



చేనేత కార్మికులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత తదితరులు

ఏలూరు సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలను ఆదరించి నేతన్నలకు అండగా నిలుద్దామని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఏలూరు జిల్లా చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలోనిర్వహించిన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొన్నారు. ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయం తర్వాత అత్య. దిక జనాభాకు చేనేత రంగమే ఉపాధి కల్పిస్తోందన్నారు. మన చేనేత కళాకారుల నేత వస్త్రాలు ఖండాతర ఖ్యాతినార్జించాయన్నారు. చేనేత రంగానికి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం అనేక కొత్త పథకాలు ప్రారంభించిందని, ప్రజలు కూడా నేత వస్త్రాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

**భీమవరంలో చేనేత వాక్**

**భీమవరం టౌన్:** చేనేత వస్త్రాలకు విస్తృత ప్రచారం కల్పించి, మార్కెటింగ్‌ను పెంపొందించాలని ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి చేనేత అధికారికి సూచించారు. గురువారం భీమవరంలో జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేనేత వాక్‌ను ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అంజిబాబు ప్రారంభించారు. మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత మాట్లాడుతూ చేనేత మగ్గాల కోసం 200 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందిం చేందుకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి అప్పారావు, మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, నేత కార్మికులు, వివిధ శాఖల జిల్లా అధికారులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న వాహనాలు చూపుతున్న పోలీసులు

## పాత నేరస్థుల అరెస్టు.. రిమాండ్

తొమ్మిది మోటార్ సైకిళ్లు, ఇంజన్ స్వాధీనం

ఆకివీడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గ వ్యాప్తంగా పలుచోట్ల మోటారు సైకిళ్ల చోరీలు జరుగుతున్న నేపథ్యంలో పాతనేరస్థులపై నిఘా పెట్టి కూపీలాగి ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించామని సీఐ వి.జగదీశ్వరరావు అన్నారు. వీరి నుంచి తొమ్మిది మోటార్ సైకిళ్లు, ఇంజన్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆకివీడు మండలం చినకాపవరానికి చెందిన కుప్పల రమేశ్(ఏసు) దొంగిలించిన ఏడు మోటార్ సైకిళ్లను ఉండి మండలం కొండగూడెం రోడ్డు పక్కన చెట్లపొదలో దాచాడు. గురువారం బయటకు తీస్తుండగా అరెస్టు చేశామన్నారు. కృష్ణాజిల్లా కృత్తివేను మండలం యండపల్లి గ్రామానికి చెందిన కూనసాని నాగాంజనేయులు దగ్గర రెండు మోటారు సైకిళ్లు, వాటర్ తోడుకునే ఇంజన్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.వీరిని కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారన్నారు. ఆకివీడు, ఉండి ఎస్ఐలు హనుమంతు నాగరాజు, నజీరుల్లా, పోలీసులు విజయ్, శివ, శంకర్, రత్నంలు కేసు ఛేదించడంతో ఎస్పీ, డీఎస్పీ అభినందించారన్నారు.

## అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

బుట్టాయగూడెం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెంలోని కరాటం వారి వీధిలో నివాసముంటున్న ఎండపల్లి గురునాథం(54) అనే వ్యక్తి గురువారం తన ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని మరణించాడు. అప్పుల బాధ భరించలేక ఉరివేసుకుని మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన గురునాథానికి భార్య, కుమారుడు ఉన్నారు.

## ఫిట్స్‌తో గిరిజన బాలిక మృతి

బుట్టాయగూడెం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆధార్ అప్‌డేట్ కోసం వస్తూ కొండరెడ్డి బాలిక గురుగుంట్ల పూర్ణ(5) మృతి చెందింది. దర్భాడకు చెందిన కొండరెడ్లు తల్లికివందనం డబ్బుల వివరాలు తెలుసుకోవడానికి, ఆధార్ అప్‌డేట్ కోసం ట్రాక్టరుపై బయల్దేరారు. ఆధార్ అప్‌డేట్ కోసం బాలిక పూర్ణ తన తల్లితో కలిసి ట్రాక్టరు ఎక్కింది. గతంలో జ్వరంతో బాధపడిన పూర్ణకు చింతపల్లి గ్రామం రాగానే ఫిట్స్ వచ్చాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పులిరామిడుగూడెం పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యాధికారిణి ఆకాంక్ష పరీక్షించి అప్పటికే బాలిక మృతిచెందినట్టు తెలిపారు. దీంతో బాలిక మృతదేహాన్ని స్వగ్రామం దర్భాడకు తీసుకెళ్లారు. బాలిక చిలకలూరులోని గిరిజన పాఠశాలలో చదువుకుంటోంది. తండ్రి సింహాద్రి గతంలోనే మరణించాడు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



ముసునూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుళ్లపూడి గ్రామం నుంచి ఒక వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 41 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం తెల్లవారు జామున పట్టుకున్నారు. జిల్లా విజిలెన్స్ అధికారికి అందిన సమాచారం మేరకు గుళ్లపూడి గ్రామంలో తనిఖీలు చేశారు. రేషన్‌షాపుల నుంచి రూ.14లకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి గుళ్లపూడికి చెందిన ధనికొండ గోపీరాజు, మర్లపాలెం గ్రామానికి చెందిన ఖాసీం, నూజివీడుకు చెందిన బియ్యం వ్యాపారులకు రూ.18కి విక్రయిస్తున్నట్టు తెలిసి దాడులు చేశారు. ఈ దాడుల్లో రూ.లక్షా 60వేలు విలువైన బియ్యం, 8 లక్షల విలువైన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, ఎస్ఐ కె.నాగరాజు, ముసునూరు సీఎస్ డీటీ పాల్గొన్నారు.

## లారీని ఢీకొట్టిన బస్సు

లారీ సడన్ బ్రేక్ వల్లే ప్రమాదం
ఒక ప్రయాణికుడి మృతి, బస్సు డ్రైవర్‌కు తీవ్రగాయాలు



నుజ్జునుజ్జయిన బస్సు ముందుభాగం

భీమడోలు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒక ప్రయాణికుడు మృతి చెందగా, బస్సు డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. శ్రీతులసి ప్రైవేటు ట్రావెల్ బస్సు నెల్లూరు నుంచి నర్సన్నపేటకు బుధవారం రాత్రి బయల్దేరింది. అర్ధరాత్రి రెండు గంటలు దాటిన తరువాత భీమడోలు సమీపంలోని పోలసానపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకు వేశాడు. అది గమనించిన బస్సు డ్రైవర్ ఎడమ వైపునకు తిప్పాడు. లారీ కూడా అదేవైపునకు రావడంతో బస్సు ఢీకొట్టింది. ప్రయాణికుడు కాయల గణేశ్ మృతి చెందగా బస్సు డ్రైవర్ గన్నవరం మండలం గొల్లన్న పల్లికి చెందిన చిమ్మట నేతాజీ(42)తీవ్ర గాయాలకు గురయ్యాడు. క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. అనకాపల్లికి చెందిన కాయల గణేశ్(28)కి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. మోటార్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. నెల్లూరు నుంచి తన గ్రామానికి వెళ్లే నిమిత్తం శ్రీతులసి ప్రైవేటు ట్రావెల్ బస్సును ఎక్కాడు. బస్సులో వెనుకసీటులో కూర్చున్నప్పటికీ అతడికి భీమడోలు సమీపంలో పోలసానపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గరకు వచ్చేటప్పటికి మూత్రవిసర్జన నిమిత్తం డ్రైవర్‌కు బస్సు ఆపమని చెప్పడానికి డ్రైవర్ క్యాబిన్‌లోకి వచ్చాడు. అదే సమయంలో బస్సు ప్రమాదానికి గురికావడంతో గణేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గణేశ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

## రైలు ఢీకొని యువతి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రైలుపట్టాలు దాటుతున్న ఒక యువతిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది.తూర్పు గోదావరి జిల్లా శంకవరం మండలం శంకవరానికి చెందిన దేవవరపు శివమ్మ(18) హనుమాన్‌జంక్షన్ సమీపంలోని ఏపూరులో బంధువుల ఇంటి వద్ద ఉంటూ మసీదు రోడ్డులో ఉన్న పలగాని వెంకటేశ్వరరావు ఇంటి వద్ద టైలరింగ్ నేర్చుకుంటోంది. యథావిధిగా గురువారం ఉదయం టైలరింగ్ నేర్చుకోవడానికి రైలు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో రైలు వచ్చి ఢీకొట్టడంతో అక్కడి కక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకుని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లిపరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## వృద్ధుడి అనుమానాస్పద మృతి

కలిదిండి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన పరసావానిపాలెంలో జరిగింది. మండలంలో పరసావానిపాలేనికి చెందిన పేరం సూరిబాబు(82) బుధవారం ఇంటి వెనుక అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వృద్ధుడి మృతిపై అనుమానాలు ఉండటంతో మనుమడు జాన్‌బాబు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## పాము కాటుకు ఒకరి బలి

ముసునూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురైన వ్యక్తి మృతి చెందిన ఘటనపై ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని సింహాద్రిపురం గ్రామానికి చెందిన చందమాల గాబ్రియేలు(45) గురువారం మధ్యాహ్నం స్థానిక గంగమ్మ చెరువులో చేపల వేటకు వెళ్ళాడు. ఈ క్రమంలో పాము కాటు వేయడంతో దగ్గరలో ఉన్న కొంత మంది పశువులకాపరులు అతడిని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గాబ్రియేలు మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

## మోసం చేశారంటూ మహిళ ఫిర్యాదు

భీమవరం క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):బ్యాంకులో రుణానికి సంబంధించి కోర్టు నుంచి స్టే తీసుకొస్తామని రూ.2 లక్షలు తీసుకుని ముగ్గురు వ్యక్తులు తనను మోసం చేశారంటూ భీమవరం మారుతీ నగర్‌కు చెందిన కె.రామలక్ష్మి వన్‌టౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేసింది. రామలక్ష్మి భర్త ఫణి వెంకట సూర్యనారాయణ 2022లో బిల్డింగ్‌కు సంబంధించి మార్టిగేజ్ లోను తీసుకున్నారు. 2024లో వెంకట సూర్యనారాయణ మరణించాడు. దీంతో లోను కట్టమని బ్యాంకు నుంచి నోటీసు పంపించగా, రామలక్ష్మి వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తున్న సంతోష్ కుమార్ ఇద్దరు ఏజెంట్లు అయిన చవ్వాకుల సత్యనారాయణ, అడ్డగర్ల సత్యనారాయణలు హైకోర్టులో స్టే తీసుకొస్తామని రూ.2 లక్షలు నగదు తీసుకున్నారు. అయితే స్టే తీసుకురాకుండా మోసం చేయడంతో రామలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కారు డ్రైవర్ వడ్డి సంతోష్ కుమార్, చవ్వాకుల సత్యనారాయణ, అడ్డగర్ల సత్యనారాయణలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.



చంద్రమౌళి మృతదేహం, ప్రమాదం జరిగిన స్థలం

## మధ్యప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదం

పందిరిపల్లిగూడెం యువకుడి మృతి, మరొకరికి గాయాలు

కైకలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):ఐషర్ వ్యాన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న పందిరిపల్లిగూడెం గ్రామానికి చెందిన యువకుడు మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కిరాయి నిమిత్తం వెళ్లిన భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. బుధవారం రాత్రి యువకుడి మృతదేహాన్ని స్వగ్రామమైన కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం తీసుకొచ్చారు. గ్రామానికి చెందిన కరణం చిరంజీవి చంద్రమౌళి(27) గత నెల 31న ఐషర్ వ్యాన్‌పై కిరాయి నిమిత్తం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు వెళ్లాడు. ఘాట్ రోడ్డులో తిరిగివస్తుండగా బ్రేకులు ఫెయిలవ్వడంతో అదుపుతప్పిన వ్యాను మలుపులో డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొట్టింది. ప్రమాదాన్ని గుర్తించి వ్యాను నుంచి దూకే ప్రయత్నం చేయగా బలమైన ఇనుపరాడ్డు తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వ్యానులో ప్రయాణిస్తున్న నత్తగుల్లపాడు గ్రామానికి చెందిన క్లీనర్ ముంగర దావీదు రాజుకు రెండు కాళ్లూ నుజ్జునుజ్జయ్యాయి. చంద్రమౌళి దగ్గర్లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని బుధవారం రాత్రి స్వగ్రామమైన పందిరిపల్లిగూడేనికి తీసుకొచ్చారు. మృతి చెందిన చంద్రమౌళికి భార్య, 5, 2 సంవత్సరాల వయస్సు కలిగిన ఆడపిల్లలు ఉన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సహకారంతో మృతదేహాన్ని రాష్ట్ర వడ్డిసాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు ఆధ్వర్యంలో స్వగ్రామానికి తీసుకొచ్చారు. వాహనం కిరాయిలు చెల్లించలేక విక్రయించేందుకు చంద్రమౌళి బేరం పెట్టాడు. చివరి కిరాయిగా మధ్యప్రదేశ్ వెళ్లి అక్కడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషాదం నెలకొంది.

## డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జరిమానా

భీమవరం క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): భీమవరం టూ టౌన్‌లో బుధవారం రాత్రి నుంచి 12 గంటల వరకు ప్రధాన సెంటర్లలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించినట్లు టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆరుగురిని అదుపులోకి తీసుకుని గురువారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. వివిధ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ముగ్గురిని కోర్టులో హాజరుపరచగా రూ.500 చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

## సీనియర్ సిటిజన్ చట్టంపై అవగాహన

ఏలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల నిర్వహణ, సంక్షేమ చట్టం-2007పై విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్‌జెండర్ శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ సంక్షేమ చట్టంపై అవగాహన కార్యక్రమంలో ఆమె గురువారం పాల్గొని మాట్లాడారు. వయోవృద్ధుల సంక్షేమం, నిర్వహణ కోసం వచ్చిన దరఖాస్తులను 90రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



## 10న మెడికల్ క్యాంపు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బీపీ, సుగర్, ఫిట్స్, పక్షవాతం వ్యాధిగ్రస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి రాయితీపై మందులు అందజేసేందుకుగాను వైద్య నిపుణులు గోపాళం శివనారాయణ ఈ నెల 10న రెగ్యులర్ మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసినట్టు జీబీఆర్ ఫౌండేషన్, శ్రీదుర్గతేజ లయన్స్ క్లబ్, జనవిజ్ఞాన వేదిక నిర్వాహకులు తెలియజేశారు. గతంలో పరీక్షలు చేయించుకున్నవారు రిపోర్టులతో హాజరు కావాలన్నారు. ఆ రోజు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.



విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

## నులిపురుగుల నివారణపై అవగాహన

బుట్టాయగూడెం/భీమడోలు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణ కార్యక్ర మంలో భాగంగా ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు అవగాహన కల్పించనున్నట్టు వైద్యాధికారులు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా బుట్టాయగూడెంలో వైద్యాధికారులు, సిబ్బంది విద్యార్థులతో కలిసి గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నులిపురుగుల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. నందాపురం, దొరమామిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు మోహిత్, ప్రియదర్శిని, ఎస్‌యూవో వి.పెద్దిరాజు, సీహెచ్‌వోలు రాజేశ్వరి, కోటేశ్వరి, హెచ్‌వి వెంకాయమ్మ పాల్గొన్నారు. భీమడోలు మండలం పూళ్ల ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యులు పి.అరుణజ్యోతి సూచించారు.గురువారం నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని సంబంధిత గోడ పత్రికను వైద్యులు, ఆశవర్కర్లు ఆవిష్కరించారు.

## దివ్యాంగురాలికి లీగల్ గార్డియన్‌షిప్ ధృవపత్రం

ఏలూరు క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మానసిక వైకల్యం కలిగిన దివ్యాంగురాలికి లీగల్ గార్డియన్ షిప్ ధృవపత్రం మంజూరు చేసినట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్ కుమార్ తెలిపారు. మానసిక వైకల్యంతో బాధపడుతున్న కైకలూరుకు చెందిన కుస్‌దీప్‌కు లీగల్ గార్డియన్‌గా దీప్ యుధిష్టరును నిర్ణయిస్తూ గురువారం కలెక్టర్ వెట్రిసెల్వి లీగల్ గార్డియన్ షిప్ ధృవీకరణ పత్రం మంజూరు చేసినట్టు తెలిపారు.

## మహిళను బెదిరించిన వ్యక్తిపై కేసు

టి.నర్సాపురం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మహిళను చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. ఎం.జయబాబు తెలిపారు. బొర్రంపాలెం గ్రామానికి చెందిన పుప్పాల పిచ్చమ్మ భర్త నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. ఈ నెల 6న బొర్రంపాలెం గ్రామ శివారు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో పిచ్చమ్మ తనకున్న మేకలను మేపుతుండగా అదే గ్రామానికి చెందిన గొడుగు జయహనుమాన్ మద్యం తాగి బైక్‌పై వచ్చి పిచ్చమ్మతో గొడవపడి బూతులు తిడుతూ పీకనొక్కి చంపుతానని బెదిరించగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు రావడంతో పారిపోయాడు. పిచ్చమ్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

## అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


ఏలూరు రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మొదటి స్థానం పొందడానికి ప్రయత్నించాలని డాక్టర్ సిస్టర్ మెర్సీ అన్నారు. సెయింట్ మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. అధ్యాపకులు మార్గదర్శకత్వంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. జూనియర్ విద్యార్థులకు మిస్‌ఫ్రెషర్ పోటీలు నిర్వహించారు. మిస్ ఫ్రెషర్ విజేతగా జి.హైందవి నిలవగా, ఆర్.సుంజన, సి.హెచ్.లిఖిత ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. సోషల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ పి.రత్నమేరి, తెలుగు హిందీ విభాగాధిపతి డాక్టర్ మహాలక్ష్మీ, భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న చేనేత కార్మికులు

## చేనేత రంగాన్ని కాపాడాలంటూ ఆందోళన

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత రంగాన్ని కాపాడాలని కోరుతూ గురువారం చేనేత కార్మిక సంఘం కార్యాలయం వద్ద కార్మికులు, యూనియన్ నాయకులు ఆందోళన నిర్వహించారు.చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ చేనేత రంగాన్ని కాపాడడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. 36వ డివిజన్‌లోని భగత్‌సింగ్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవాన్ని ఏపీ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం పతకాన్ని కన్నయ్య ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి నూలుపోగు దండ వేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు చెడ్డి శ్రీనివాసడాంగే, నాయకులు పళ్ళెం కిశోర్, ఎం.శ్రీనివాసరావు, యర్రా నాగేశ్వరరావు, చిక్కంశెట్టి సుబ్రహ్మణ్యం, బాలాజీ శీలా సావిత్రి, కర్రా వరలక్ష్మి, జి.జ్ఞానేశ్వరి, విశ్వనాధ సూర్యకాంతం, టి.సావిత్రి, యర్రా దుర్గ పాల్గొన్నారు.



కల్లుగీత కార్మికులతో ఎక్సైజ్ సీఐ అశోక్, తదితరులు

## 'గీత కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు'

ఏలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ అన్నారు. లింగపాలెం మండలంలోని ములగలంపాడు గ్రామంలో కల్లుగీత కార్మికులకు టాపింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గీత కార్మికులకు మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్ఐలు జగ్గారావు, అబ్దుల్‌ఖలీల్, విఆర్‌ఓ అనిత, పురుషోత్తంరావు, పలువురు సిబ్బంది, గీతకార్మికులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై దాడి... ముగ్గురి అరెస్టు

ఏలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):పేకాట స్థావరంపై దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు లింగపాలెం మండలం ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. తువ్వచిలుక రాయుడుపాలెంలో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 1550 రూపాయలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

# పొలిటికల్ వార్

(5వ పేజీ తరువాయి)

గట్టిగా పట్టుబడుతున్నారు.ఇదే విషయాన్ని తన పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా పేదల పక్షానే తాను ఉంటానని, వారికి న్యాయం జరిగేంత వరకు వెనకడుగు వేసేది లేదని ప్రభాకర్ గట్టి భరోసానే ఇచ్చారు. దీనితో అబ్బాయి వర్గం కూడా టీడీపీపై ఎదురుదాడికి ప్రయత్నిస్తోంది. కావాలనే రాజకీయం చేస్తున్నారని తమపై పడిన బురదను తుడిచి వేసేందుకు వైసీపీ ప్రయత్నాలు చేస్తోంది.

**చింతలపూడిలో జనసేన వర్సెస్ టీడీపీ :** చింతలపూడి నియోజకవర్గంలో సొసైటీల్లో త్రిసభ్య కమిటీల వ్యవహారం రచ్చకెక్కుతోంది. తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని జనసేన తీవ్రంగానే విరుచుకపడుతోంది. ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య టీడీపీ చెప్పిందొకటి, చేస్తోందొకటంటూ గురువారం విరుచుకుపడ్డారు. చింతలపూడి నియోజక వర్గంలో 20 సొసైటీలు ఉండగా, వీటిలో ఐదు సొసైటీలను తమ పార్టీకి ఇచ్చినట్లే ఇచ్చి రెండు లాగేసుకున్నారని, మిగిలిన మూడింటిలో ఒకదానిలో ఎమ్మెల్యే తాలూకా మనిషిని పెట్టుకున్నారని, మిగిలిన రెండిం టినైనా తమకు ఇస్తారో, లేదోనని సందేహం వ్యక్తం చేస్తున్నారు. తాడువాయి, కామవరపు కోట సొసైటీలను ముందు ఇస్తామని, ఆ తర్వాత పక్కకు తప్పిస్తున్నారంటూ ఆగ్రహంతో ఉన్నారు. తిరుమలాపురం సొసైటీ వ్యవహారంలోనూ టీడీపీ ఏకపక్షంగా వ్యవహరిస్తుందంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. త్రిసభ్య కమిటీల్లో పొత్తుధర్మం పాటిం చకుండా ఏకపక్షం ఏమిటని నిలదీయడం ఆరంభించారు. ఎమ్మెల్యే రోషన్ కుమార్ తీరుపైన ఒకింతఅసంతృప్తినే వ్యక్తం చేస్తున్నారు.

# మూగవేదన..

- యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా
- అధికారుల చర్యలపై విమర్శలు
- పట్టించుకునేవారే లేరని ఆగ్రహం



లారీలో తరలిస్తున్న గొర్రెలు, పశువులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రధాన రహదారుల్లో నిత్యం మూగజీవాల అక్రమ రవాణా నిర్విరామంగా జరుగుతోంది. ఆవులు, గొర్రెలు, ఎద్దులు రోజూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అక్రమంగా తరలిపోతూనే ఉన్నా సంబంధిత అధికారులు తీసుకునే చర్యలు దాదాపు శూన్యమనే చెప్పాలి. గాలి సరిగా చొరబడని క్యాబిన్‌లలో ఇరుకుగా ప్రయాణిస్తున్న ఆ మూగజీవాలు తమ బాధను ఎవరికీ చెప్పుకోలేని దుస్థితి... కబేళాలకు వెళ్లక ముందే కళేబరాలుగా మిగులుతున్న మూగజీవుల రోదనను ఎవరూ పట్టిం చుకోవడం లేదు. గంటల కొద్దీ సాగే ఈ ప్రయాణంలో ఎటూ కదలలేనిస్థితి వాటిది.. ఆహారం ఇచ్చే వారుండరు.. కనీసం నీరు కూడా అందదు.. గమ్యం చేరే లోపే కొన్నింటికి ఊపిరి ఉంటుందో ఉండదో అన్నది అనుమానమే.. వాటిని తరలించే వ్యాపారులు ఎంతటి దయాహీనులో వాటి కంటినుంచే ద్రవించే ఆనీటి బిందువులే సజీవ సాక్ష్యం. పలు ప్రాంతాల్లో ఇలా పశువుల అక్రమ రవాణాను పోలీసులు, స్థానికులు పట్టుకున్న సందర్భాలు కొన్ని ఉన్నాయి. ఈ ఏడాది జనవరిలో ఏ విధమైన అనుమతులు, వాహనాలకు రిజిస్ట్రేషన్ కూడా లేకుండా జరుగుతున్న గోవుల అక్రమ రవాణాను కొందరు స్థానికులు అడ్డుకున్నారు. మండలంలోని ఎం.నాగులపల్లి వద్ద రెండు బొలేరో వాహనాల్లో విశాఖ జిల్లా చోడవరం నుంచి గుంటూరుకు వెళ్తున్న వాహనాలు అడ్డుకుని ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈఏడాది మేలో



కంటైనర్‌లో దీనంగా ఉన్న ఆవులు

సైతం ఓ పెద్ద కంటైనర్‌లో ఆవులను ఎద్దులను తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. ద్వారకా తిరుమల మండలం బుట్టాయగూడెం జాతీయ రహదారిపై పశువుల అక్రమరవాణా జరుగుతుందన్న సమాచారాన్ని అందుకున్న పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. ఈ అక్రమరవాణాలపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

### గోవులను సంరక్షించాలి



హిందువులు దైవంగా భావించే గోవులను అక్రమంగా తరలిస్తున్నారు. బీజేపీ నాయకులు, భజరంగ్ దళ్ సభ్యులు చాలా సార్లు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసుల కన్నుగప్పి అక్రమరవాణా జరిగే అవకాశం ఉంది. గోవుల రక్షణకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలి.

**శరణాల మాలతీరాణి, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకురాలు, నారాయణపురం**

## నేడు సీపీఎం నిరసన

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఓటర్ల హక్కులను హరించే ఎస్‌ఐఆర్‌ను వ్యతిరేకించాలని కోరుతూ శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం తెలిపారు. ఎస్ఐఆర్ అమలైతే దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కు కోల్పోతారని అన్నారు.

## హుండీ ఆదాయం లెక్కింపు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని శ్రీలక్ష్మీగణపతిస్వామి ఆలయ హుండీలను గురువారం గ్రూపు దేవాలయాల అధికారి ఎం.రాధ పర్యవేక్షణలో 64 రోజులకుగాను లెక్కించగా 85 వేల 229 రూపాయల ఆదాయం లభించినట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి సి.హెచ్.చిన నాగేశ్వరరావు తెలిపారు.

## టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే నివాళి

కామవరపుకోట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రావికంపాడు గ్రామానికి చెందిన టీడీపీ ముఖ్య నాయకుడు మాన్యం దుర్గారావు తండ్రి మాన్యం నారాయణరావు ఇటీవల మృతి చెందడంతో గురువారం దుర్గారావు నివాసం వద్ద సంస్మరణ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ హాజరై నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, టీడీపీ శ్రేణులు జగ్గవరపు ముత్తారెడ్డి, కోనేరు వెంకట సుబ్బారావు, ఏలూరి హరిరామకృష్ణ, డోలా విజయ్, ఘంటా సుధీర్‌బాబు, వేముల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## స.హ. చట్టంపై అవగాహన

ఏలూరుటూటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం - 2005 చట్టంపై అవగాహన కార్యక్రమం మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ, వాణిజ్య అధికారి ఎండీ శ్రీనివాసరావు, ఆర్‌టీఐ యాక్ట్‌పై అవగాహన కలిగించారు. మార్కెటింగ్ ఏడీ మహేంద్రనాథ్, సెక్రటరీ మంజుల, రైతు బజారు ఎస్టేట్ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

## రోడ్డుకు మరమ్మతులు

చింతలపూడి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చింతలపూడి నుంచి గురుభట్లగూడెం తెలంగాణ సరిహద్దు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ గురువారం ప్రారంభించారు. రోడ్లు, భవనాల శాఖ నుంచి మంజూరైన రూ.4 కోట్లతో పది కిలోమీటర్ల పొడవున ఈ ప్యాచ్ వర్క్ పనులు జరుగుతాయన్నారు. నాయకులు జె.ముత్తారెడ్డి, సి.హెచ్.ధర్మరాజు, టి.చంద్రశేఖరరెడ్డి, సి.హెచ్. మధుబాబు, టి.అప్పారావు, ఆర్.హనుమంతరావు పాల్గొన్నారు.



అధ్వానంగా మారిన రోడ్డు

## కాలనీ రోడ్డును నిర్మించండి

టి.నర్సాపురం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెంలోని కొత్తపేట నుంచి జగనన్న కాలనీకి (మత్స్యకారుల ఇళ్లకు) వెళ్లే మట్టి రోడ్డును అభివృద్ధి చేయాలని సామాజిక కార్యకర్త గుండే పాండురంగ గురువారం డిమాండ్ చేశారు. చినుకుపడితే చిద్రంగా మారుతోందని, ఈ రోడ్డు దుస్థితిపై అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితంలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధి చేయాలని బురద నుంచి ఉపశమనం కలిగించాలని ఆయన కోరారు.



## లోకేశ్‌ను కలిసిన కొక్కిరగడ్డ

(ఏలూరు-ఆంధ్రజ్యోతిప్రతినిధి)

పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన తనకు ఏదైనా నామినేటెడ్ పదవి ఇస్తారని ఆశిస్తున్నానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్‌ను జడ్పీ మాజీ చైర్మన్ కొక్కిరగడ్డ జయరాజ్ కలిసి విజ్ఞప్తి చేశారు. అమరావతిలో ఆయనను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఇదే సందర్భంలో పార్టీ అభివృద్ధికి మరింత కష్టపడి పనిచేయాలని మంత్రి లోకేష్ కూడా ఆకాంక్షించారు. పార్టీ కోసం పని చేసిన వారికి తగు న్యాయం చేయడానికి సంసిద్ధంగా ఉన్నట్టు చెప్పినట్లు జయరాజ్ వెల్లడించారు.

## నేడు పేరంటాలమ్మకు సారె

దెందులూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): గాలాయగూడెం గ్రామదేవత శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి చీర, సారె అందజేయనున్నట్టు ఆలయ కమిటీ నిర్వాకులు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ స్థులంతా హాజరుకవాలని కోరారు. 116 మంది ముత్తైదువులతో 39 రకాల పిండి వంటలతో పసుపు, కుంకుమ, పుట్టింటి సారెను అందించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

## బీసీల అభ్యున్నతికి సీఎం కృషి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ఎనలేని కృషి చేస్తున్నారని క్షత్రియకార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాంచంద్రశేషు అన్నారు. గురువారం పట్టణ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రామలింగేశ్వరరావు, శేషు మాట్లాడుతూ బీసీలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, తెలుగు మండల రైతు అధ్యక్షుడు ఎలికే వరప్రసాద్, రాగాని శ్రీనివాసరావు, ఎలికే తాతారావు పాల్గొన్నారు.

## 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవ సంక్షేమ భవనంలో బీసీ ఐకాస ఆధ్వర్యంలో లంకా వెంకటేశ్వర్లు అధ్యక్షతన మండల్‌డే నిర్వహించారు. తొలుత బి.పి.మండల్ చిత్రపటానికి నివాళులర్పించారు.ఈసందర్భంగా లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో తొలిసారిగా బీసీ రిజర్వేషన్లు అమలు చేసి సామాజిక న్యాయం కల్పించిన ఘనత మండల్‌కు, ఆనాటి ప్రధాని వీపీ సింగ్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్రంలో బీసీ జనభా లెక్కల ప్రకారం 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జేఏసీ ఉపాధ్యక్షులు ఉక్కుసూరి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గీకరణ విధానం అమలు చేయాలని జేఏసీ నాయకులు ఎం.సూర్య నారాయణ విజ్ఞప్తి చేశారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లో రిజర్వేషన్లు కల్పించాలని జేఏసీ కార్యదర్శి మార్గాని శ్రీనివాస్ కోరారు. రాష్ట్రంలో బీసీ రక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని జేఏసీ నాయకులు లక్కోజు గోపి డిమాండ్ చేశారు. సూర్యనారాయణ ఎ.రామారావు, ఎ.మురళి, జి.సుధాకర్‌రావు, టి.సూర్యనారాయణ, జై శ్రీనివాస్, అచ్యుత్ పూలే పాల్గొన్నారు.

## సొసైటీ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ పట్టణ తెలుగు రైతు అధ్యక్షుడు మానికల నాగేశ్వరరావు జంగారెడ్డిగూడెం సొసైటీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ ఆధ్వర్యంలో మానికల నాగేశ్వరరావును స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద ఘనంగా సత్కరించారు. తనపై నమ్మకముంచి సొసైటీ అధ్యక్షుడిగా నియమించినందుకు ఎంపీ మహేష్, ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సీతారామాలయంలో పూజలు

ఉంగుటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కైకరం శ్రీ సుందర సీతారామాలయ ఆలయ పునరుద్ధరణ తృతీయ వార్షికోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నిడదవోలు శుక్ల యజుర్వేద స్మార్త పండిట్ పొన్న రాజశేఖర్ గురుత్వంలో శాస్త్రోక్తంగా ఆయుష్ సూక్త హోమాన్ని నిర్వహించారు. అనంతరం పూర్వజానంద సరస్వతి మాతాజీ ఆధ్యాత్మికత, సేవా మార్గం గురించి భక్తుల నుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.ఈ సందర్భంగా భక్తులు హోమంలో జంటలుగా పాల్గొని పూజలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయ కమిటీ తరఫున కూనా అప్పారావు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

## ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

ఏలూరుటూటౌన్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): తగ వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ప్రతీ రోజు తనను కలిసి సమస్యలు చెప్పుకునేవారందరికీ ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు.

## ఇళ్లపట్టాలు మంజూరు చేయాలి

టి.నర్సాపురం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): ఎర్రచెరువు కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పశ్చిమ గోదావరి జిల్లా బీసీ విభాగాల కోఆర్డినేటర్ కొండపల్లి రవి కోరారు. నూజివీడులో ఏపీ రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని అన్నట్టు తెలిపారు.



## పాఠశాలకు సౌండ్‌సిస్టమ్ బహూకరణ

టి.నర్సాపురం, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): బండివారిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామపెద్దలు దాసరి రాంబాబు, జూపల్లి శేషగిరిరావులు రూ.20 వేలు విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను గురువారం అందజేసినట్టు హెచ్‌ఎం టి.బాజా తెలిపారు. దాతలు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు. ఉపాధ్యాయులు వీఎస్.అశోక్, వేణు, ఆదినారాయణ, శ్రీను, ఆర్‌వీ.రమణ పాల్గొన్నారు.

## అమ్మా నేను సైలెంట్‌గా ఉంటానే..



కామవరపుకోట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ యూజీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన దాదాపు 257 మందికి స్థానిక అభ్యుదయ డిగ్రీ కళాశాలలో గురు వారం పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో భాగంగా బుట్టాయి గూడేనికి చెందిన సలీన అనే యువతి తన నాలు గు నెలల వయస్సు కలిగిన చంటి బిడ్డతో విచ్చేసి పరీక్షను రాయడం విశేషం. ఆ బిడ్డ ప్రశాంతంగా పరీక్షను తిలకించడంతో ప్రాధాన్యతను సంతరించుకుంది.

## లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

చింతలపూడి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి. ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సీఐటీయు ఆరవ మహాసభ జరిగింది. సభలో ఆయన మాట్లాడుతూ పోరాడి తెచ్చుకున్న చట్టాలను మార్పు చేసి కార్మికులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. చింతలపూడి మునిసిపాలిటీలో జీవో ప్రకారం కార్మికులకు జీతాలు చెల్లించడంలేదన్నారు. కన్వీనర్‌గా నత్తా వెంకటేశ్వరరావు, కో-కన్వీనర్లుగా సువర్ణరాజు, ఆమని, విజయరాజు, కమిటీ సభ్యులుగా బి.నాగరాజు, ఎల్.వంశీ, ఎం.బాలరాజు, ఎన్. వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.



## విస్తృతంగా ఇంటింటికీ టీడీపీ ప్రచారం

చింతలపూడి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని పాత చింతలపూడి గ్రామంలో సుపరి పాలనలో తొలి అడుగు, ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని కూటమి నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఇంటింటా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. ఈనెల 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలవుతుందని తెలిపారు. కుటుంబాలవారికి ఏఏ సమస్యలు ఉన్నాయో తెలుసుకుని వాటిని నమోదు చేశారు. ప్రచారంలో టీడీపీ నాయకులు కె.రాజారత్నం, ఎం.ఆదాం, పలువురు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న గిరిజన నాయకులు

## ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కెఆర్ పురం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై గురువారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాల్లోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆదివాసీలకు విద్య,వైద్యం,జీవనోపాధి అవకాశాలను కల్పించడమే నిజమైన అభివృద్ధి అని అన్నారు. ఆదివాసీ దినోత్సవం నిర్వహణకు ఎమ్మెల్యే రూ.2 లక్షలను చెక్కును పీవో కె.రాములు నాయక్‌కు అందజేశారు. అధికారులు, ఆదివాసీ సంఘాల నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

**కరపత్రాలు విడుదల:** ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ బుట్టాయగూడెంలో కరపత్రాలు విడుదల చేశారు. ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు. కారం రాఘవ, కె.రాముడు, రాజు, టి.బాబురావు, కన్నారావు, వెంకన్నబాబు, రాజారెడ్డి పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ కల్పించాలి

ఏలూరు రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ క్రైస్తవ సంఘాలు, ఏలూరు నగర క్రైస్తవ శాఖల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు.తొలుత విద్యా నగర్‌లోని బిషప్ నుంచి అమీనా పేట చర్చి మీదుగా ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. రాజ్యాంగ సవరణల ద్వారా రిజర్వేషన్లు కల్పించిన భారత ప్రభుత్వం దళిత క్రైస్తవులకు రాజ్యాంగ బద్ధంగా అందాల్సిన రిజర్వేషన్లు గత 75 ఏళ్లుగా అందనివ్వకుండా చేస్తోందని విమర్శించారు. దళిత క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, రెవరెండ్ ఫాదర్ మైఖల్, మోహన్ శాస్త్రీ, శాంతి సాగర్, తోట గాబ్రియేల్, జి.మోజేష్, తోట అంతోని, దోమతోటి అబ్రహం పాల్గొన్నారు.

### విభిన్న ప్రతిభావంతులకు కాలిపర్స్ అందజేత

ఉంగుటూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బొమ్మిడి గ్రామానికి చెందిన అందుగుల భూషణం కాలు ఇన్ఫెక్షన్‌కు గురైంది. ఈ విషయమై ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు విన్నవించడంతో జిల్లా విభిన్న ప్రతిభా వంతుల సంఘం అసిస్టెంట్ డైరెక్టర్ రామ్ కుమార్ స్పందించి తక్షణ సాయం కింద కాలిపర్స్ అందించారని రాష్ట్ర దివ్యాంగ సంఘటన్ అధికార ప్రతినిధి కోనే సత్యనారాయణ తెలిపారు.

## నానో ఎరువులపై అవగాహన

పెదపాడు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంభించాలని, వరి సాగులో నానో యూరియాను పొలంలో పిచికారీ చేసేందుకు డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా ఖర్చు, వృద్ధా, సమయాన్ని ఆదా చేసుకోవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ అనిల్‌కుమారి తెలిపారు. పెదపాడులో సాగులో డ్రోన్ల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఏడీఏ అనిల్ కుమారి మాట్లాడుతూ నానో యూరియాను వినియోగించాలని, వరినాట్లు వేసిన 40-45 రోజుల తరువాత ఒకసారి, పూతదశకు వారం రోజుల ముందు ఒకసారి పిచికారీ చేయాలన్నారు. పెదపాడు నీటి సంఘం అధ్యక్షులు బొప్పూడి కాశీబాబు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలతో సాగులో దిగుబడి పెంచుకోవాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటపొలాల్లో డ్రోన్ల వినియోగాన్ని వివరించారు. ఏవో షేక్ ఇమామ్ ఖాసిం పాల్గొన్నారు.

### ఎరువుల డీలర్లకు..

చింతలపూడి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎరువులు,



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పురుగు మందులు డీలర్లకు స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సదస్సులో సహాయ సంచాలకులు వై.సుబ్బారావు మాట్లాడుతూ ఎరువుల అమ్మకాల్లో రిజిష్టర్ల నిర్వహణ ఏ విధంగా చేయాలో సూచనలిచ్చారు. సీఐ క్రాంతికుమార్ మాట్లాడుతూ సర్కిల్‌లో రోజుకి ఒకటి, రెండు పురుగు మందులు తాగి చనిపోయిన కేసులు వస్తున్నాయని, రైతులకు విక్రయించే పురుగు మందులు రైతులని నిర్ధారణ చేసుకుని ఇవ్వాలని, అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎరువులు కూడా భూవిస్తీర్ణాన్ని బట్టి, సాగును బట్టి సరిపడా ఎరువులివ్వాలని సూచించారు. నాలుగు మండలాల డీలర్లు పాల్గొన్నారు.



ప్రముఖులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

## విద్యార్థులు ఉన్నత లక్ష్యానికి కృషి చేయాలి : ఏఎస్పీ

దెందులూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని ఏలూరు జిల్లా ఏఎస్పీ సూర్యచంద్రరావు అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డేని కాలేజీ చైర్మన్ వనమా రాఘవేంద్ర, ప్రిన్సిపాల్ బాలకృష్ణా ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఏఎస్పీ ఎస్.సూర్య చంద్రరావు, కళాశాల ఫౌండర్ చైర్మన్ మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరావులు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, క్రమ శిక్షణతో విద్యనభ్యసించాలన్నారు. కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్.లక్ష్మణరావుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నల్లబ్యాడ్జీలతో అధ్యాపకుల నిరసన

కైకలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అధ్యాపకుల సాధారణ బదిలీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని జీసీటీఏ ఏలూరు జిల్లా యూనిట్ కార్యదర్శి డాక్టర్ ఎం. విజయకుమార్ డిమాండ్ చేశారు. గురువారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీలతకు వినతిపత్రాన్ని అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ అడపా కేదారి, కార్యదర్శి పి రవికుమార్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఎం హరిప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి: ఆర్డీవో

కైకలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అన్నారు. గురువారం కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను తనిఖీ చేశారు. కైకలూరు, ఆటపాక గ్రామంలోని అగ్రహారం రోడ్డులోని భూ ఆక్రమణలపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో వాటిని పరిశీలించారు. నీటి తీరువా, పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. తహసీల్దార్ ఇబ్రహీం, ఆర్ఐ బి వెంకటేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి


మాట్లాడుతున్న సీపీడీసీఎల్ చైర్మన్ పి. పుల్లారెడ్డి

నూజివీడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అంతరాయాలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీపీడీసీఎల్ చైర్మన్ పొగాకు పుల్లారెడ్డి అన్నారు. నూజివీడులో ఆయన విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ అవసరాల దృష్ట్యా 132, 33 కేవీ ఉపకేంద్రాల ఏర్పాటు అవసరం పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి మండల స్థాయిలోనూ విద్యుత్ సరఫరాపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి, సేవా లోపం లేకుండా చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట ఉపకేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా మండలాల పరిధిలో అధికారులకు రేటింగ్‌ను ఇవ్వడం జరుగుతుందని, పనితీరులో లోపం ఉంటే క్రమశిక్షణా చర్యలు తప్పవన్నారు. వ్యవసాయ కనెక్షన్‌లను త్వరితగతిన మంజూరు చేయాలని సూచించారు. ఈఈలు టి.హనుమయ్య, వై.కొండలరావు, ఆర్.రవికిషోర్‌తో పాటు ఆయాప్రాంతాల డీఈఈలు పాల్గొన్నారు.

## ఉనికి కోసమే వైసీపీ దుష్ప్రచారం


కట్టా నాగ దుర్గారావు

చాట్రాయి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పేరుతో కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారం తమ ఉనికిని కాపాడుకోవాలనే ప్రయత్నంలో భాగమే అని నరసింహారావుపాలెం పీఏసీఎస్ చైర్మన్ కట్టా నాగ దుర్గారావు విమర్శించారు. జగన్ 5 ఏళ్ళ పాలనలో కనీసం రోడ్లు గురించి పట్టించుకోకపోవటంతో గోతులమయంగా మారి ప్రజలు నరకయాతన అనుభవించారని, కూటమి అధికారంలోకి రాగానే గ్రామాల్లో సీసీ రోడ్లు, పెన్షన్ పెంపు, తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉన్నా ఒక్కొక్కరికి రూ. 13 వేలు, అన్నదాత సుఖీభవ పథకంలో రైతులకు ఖాతాలకు సొమ్ము జమచేశారన్నారు. వచ్చే నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి రానున్నదన్నారు. గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సారథ్యంలో నూజివీడు నియోజకవర్గం అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నదని, వైసీపీ బూటకపు మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో వైసీపీ కనుమరుగవటం ఖాయమన్నారు.

## చేపల సాగును పరిశీలించిన జార్ఖండ్ రైతులు



కైకలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కొల్లేరు గ్రామాల్లో చేపలు సాగు విధానం ఎంతో బావుందని జార్ఖండ్ రైతులు పేర్కొన్నారు. గురువారం కైకలూరు మండలం ఆటపాక, తదితర ప్రాంతాల్లో చేపల సాగు విధానాన్ని పరిశీలించారు. చేప పిల్లల తయారీ కేంద్రాలను, చేపలకు వినియోగించే మేతల గోదాము, మందులు, చేపలను పరిశీలించారు. ఆటపాకలో రాష్ట్ర చేపల రైతుల సంఘం మాజీ అధ్యక్షుడు ముదునూరి సీతారామరాజు చెరువులో తెల్లచేపల పెంపకాన్ని పరిశీలించారు. అలాగే ఆక్వా దుకాణాల్లో మందులు పరిశీలించి పలు విషయాలను తెలుసుకున్నారు. ఆచవరంలో చేపలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే ప్యాకింగ్ షెడ్లను పరిశీలించి ఏ విధంగా ప్యాక్ చేసి చేపలను లారీల్లోకి ఎగుమతి చేస్తారో తెలుసుకున్నారు. అలాగే కొరమేను చేపల సాగుపై మత్స్యశాఖ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఝార్ఖండ్ రైతులు మాట్లాడుతూ ఇక్కడ సాగు విధానాలు బాగున్నాయన్నారు. కైకలూరు మత్స్యశాఖ ఏడీ రాజ్‌కుమార్, ఎఫ్‌డీవో గణపతి, రాంచీ మత్స్యశాఖ అధికారి ప్రశాంత్ కుమార్ దీపక్, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన పీఏసీఎస్ చైర్మన్ తుమ్మల



చాట్రాయి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జనసేన కోటాలో చాట్రాయి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా నియమితులైన తుమ్మల రామ్మోహనరావు గురువారం గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకతీతంగా రైతులందరికి రుణాలు, ఎరువులు అందించడంతో పాటు, అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించి, సొసైటీని అభివృద్ధి చెయ్యాలని చైర్మన్‌ను మంత్రి కోరారు. జనసేన నాయకులు తుమ్మల జగన్, కరుణాకర్ తదితరులు మంత్రిని కలిశారు.

## క్రీడా సామగ్రి వితరణ



కలిదిండి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తాడినాడ జడ్పీ హైస్కూల్‌కి పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు క్రీడా సామగ్రిని గురువారం బహూకరించారు. పూర్వ విద్యార్థులు గాది రాజు రమేష్ రాజు క్రీడా కోర్టులు, పోల్స్ ఏర్పాటుకు రూ.25 వేలు, జి.విజయ రామకృష్ణంరాజు ఆట వస్తువులకు రూ.26 వేలు ఆర్థిక సాయం అందించి కోర్టులు ఏర్పాటు కోసం పోల్స్ వేసి శంకుస్థాపన చేశారని ప్రధానోపాధ్యాయుడు జి.వి.రమణ తెలిపారు. తాడినాడ సర్పంచ్ తాడి శ్రీనివాసరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ నంబూరి వెంకట్రామ రాజు, విద్యాకమిటీ చైర్మన్ అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు మావుళ్లేశ్వరరావు పాల్గొన్నారు.

# పొలిటికల్ వార్

(5వ పేజీ తరువాయి)

గట్టిగా పట్టుబడుతున్నారు. ఇదే విషయాన్ని తన పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా పేదల పక్షానే తాను ఉంటానని, వారికి న్యాయం జరిగేంత వరకు వెనకడుగు వేసేది లేదని ప్రభాకర్ గట్టి భరోసానే ఇచ్చారు. దీనితో అబ్బయి వర్గం కూడా టీడీపీపై ఎదురుదాడికి ప్రయత్నిస్తోంది. కావాలనే రాజకీయం చేస్తున్నారని తమపై పడిన బురదను తుడిచి వేసేందుకు వైసీపీ ప్రయత్నాలు చేస్తోంది.

### చింతలపూడిలో జనసేన వర్సెస్ టీడీపీ

చింతలపూడి నియోజకవర్గంలో సొసైటీల్లో త్రిసభ్య కమిటీల వ్యవహారం రచ్చకెక్కుతోంది. తమకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని జనసేన తీవ్రంగానే విరుచుకపడుతోంది.ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య టీడీపీ చెప్పిందొకటి, చేస్తోందొకటంటూ గురువారం విరుచుకుపడ్డారు. చింతలపూడి నియోజక వర్గంలో 20 సొసైటీలు ఉండగా, వీటిలో ఐదు సొసైటీలను తమ పార్టీకి ఇచ్చినట్లే ఇచ్చి రెండు లాగేసుకున్నారని, మిగిలిన మూడింటిలో ఒకదానిలో ఎమ్మెల్యే తాలూకా మనిషిని పెట్టుకున్నారని, మిగిలిన రెండిం టినైనా తమకు ఇస్తారో, లేదోనని సందేహం వ్యక్తం చేస్తున్నారు. తాడువాయి, కామవరపు కోట సొసైటీలను ముందు ఇస్తామని, ఆ తర్వాత పక్కకు తప్పిస్తున్నారంటూ ఆగ్రహంతో ఉన్నారు. తిరుమలాపురం సొసైటీ వ్యవహారంలోనూ టీడీపీ ఏకపక్షంగా వ్యవహరిస్తుందంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. త్రిసభ్య కమిటీల్లో పొత్తు ధర్మం పాటించకుండా ఏకపక్షం ఏమిటని నిలదీయడం ఆరంభించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే రోషన్ కుమార్ తీరుపైన ఒకింత అసంతృప్తినే వ్యక్తం చేస్తున్నారు.

**బ్రాయిలర్ ధరలు**



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 105, 113, 124 |
| చికెన్ విత్ స్కిన్ | 200 |
| చికెన్ స్కిన్‌లెస్ | 210 |

**నెక్ కోడి గుడ్డు ధర (100)**
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

# బంగారం... భలే మోసం..

ప్రస్తుతం బంగారం ధర చుక్కల్లో ఉంది. దీంతో బంగారం విక్రేతలు వినియోగదారులను పలు విధాలా మోసగిస్తున్నారు. వస్తువు కొనుగోలు చేసిన కొన్నేళ్ల తర్వాత దానిని మార్చుకునే సమయం వరకు వినియోగదారులకు తాము మోసపోయామన్న విషయం బయటపడడం లేదు. ఇది వ్యాపారులకు వరంగా మారింది.


నకిలీ బంగారంతో తయారైన గాజు (ఇన్‌సెట్) నకిలీ బంగారానికి కూడా హాల్ మార్కు వేసిన వైనం

- ఆఫర్లతో ఒకవైపు.. 916 కేడీఎం అంటూ మరోవైపు
- వినియోగదారులను దగాచేస్తున్న పలువురు వ్యాపారులు

భీమవరం క్రైం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో కొన్ని దుకాణాల యజమానులు ఆఫర్లతో ఖాతాదారులకు వల వేస్తున్నారు. మూడు రోజులపాటు ప్రత్యేక ఆఫర్లంటూ దుకాణాల వద్ద బోర్డులు పెట్టడం, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌ల ద్వారా మెస్సేజ్‌లు పంపి మూడు రోజుల పాటు ఏ వస్తువు కొనుగోలు చేసినా తరుగు, మజూరీ లేదంటూ చెప్పడంతో కొనుగోలుదారులు ఆయా దుకాణాలకు ఎగబడుతున్నారు. దుకాణాల వద్దకు వెళ్ళాక గాని తెలియడం లేదు వారి మాయాజాలం. కొన్ని వస్తువులకే తరుగు, మజూరీ లేదని అక్కడకు వెళ్ళాక చల్లగా చెబుతున్నారు. దీంతో చేసేదేమీ లేక వారు చూపించిన వస్తువులనే కొనుగోలు చేయవలసి వస్తుంది. ఎక్కువగా వ్యాపారులు రాళ్ళ వస్తువులనే తరుగు, మజూరీ లేకుండా విక్రయాలు చేస్తూ ఉంటారు. ఎందుకంటే రాళ్లల్లో భారీ వ్యత్యాసం రావడంతో వ్యాపారులకు అధిక లాభం చేకూరుతుంది. ఉదాహరణకు ఒక రాళ్ళ వస్తువుకు 25 గ్రాముల రాళ్ళు ఉంటే ఆ వ్యాపారి 15 గ్రాములు మాత్రమే రాళ్ళ తూకం తగ్గిస్తాడు. అంటే మిగిలిన 10 గ్రాములు బంగారు తూకంలో జమ చేసుకుంటాడు. ఆ రకం గా కొనుగోలుదారులు నష్టపోతుంటారు. ఇటువంటి దందాలు జిల్లాలో యథేచ్ఛగా కొందరు వ్యాపారులు చేస్తున్నప్పటికీ అధికారుల దాడులు లేకపోవడంతో వారి పని చాకచక్యంగా సాగిపోతోంది.

**916 కేడీఎం పేరిట దగా..**

తమకు తెలిసిన షాపుల్లోకి వెళ్ళి పలువురు బంగారం కొనుగోలు చేస్తుంటారు. ఆ నమ్మకమే వ్యాపారులకు ధనాలాభంగా మారుతుంది. కొన్ని వస్తువులను 916 కేడీఎం స్టాంప్‌తో విక్రయిస్తారు. అయితే అవి పూర్తిగా 916 కేడీఎం రాకపోవడంతో మార్చే సమయంలో విషయం పూర్తిగా అర్థమవుతుంది. కొంత మంది వ్యాపారులపై నమ్మకంతో హాల్ మార్క్ లేకుండానే వస్తువులు కొనుగోలు చేసుకుని వెళ్ళిపోతూ ఉంటారు. దానిపై 916 కేడీఎం ఉందా, లేదా అనేది మాత్రమే చూసుకుంటారు. వస్తువులు కొన్నేళ్ళ తర్వాత మార్చే సమయంలో అవి మిషన్‌పై పరీక్ష చేయగా 916 రాకపోవడంతో ఖంగుతింటారు. చేసేదేమీ లేక అప్పుడే వస్తువులను మార్పు చేసుకుని మోసపోయామని నిర్ధారించుకుంటారు. ఆ సమయంలో వస్తువులు చేయించిన దుకాణ యజమాని దగ్గరకు వెళితే తాను 916 కేడీఎం చేయించి ఇచ్చానని చల్లగా చెబుతారు. ఇలా కొనుగోలుదారులు అన్ని విషయాల్లోను నష్టపోతూనే ఉన్నారు.

**హోల్ సేల్ వ్యాపారుల మోసాలిలా..**

పశ్చిమలో ఎక్కువగా బంగారం వ్యాపారం సాగుతుంది. జిల్లాలోని భీమవరంతోపాటు నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు వంటి ప్రధాన పట్టణాల్లో బంగారం వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది. ఈ ప్రాంతాలకు విజయవాడ, మద్రాస్, ముంబాయితోపాటు నరసాపురం నుంచి కూడా హోల్‌సేల్ వ్యాపారులు ఆయా పట్టణాలకు వచ్చి దుకాణాలకు హోల్‌సేల్‌గా బంగారు వస్తువులను విక్రయిస్తూ ఉంటారు. వారు కూడా అందినకాడికి దోచుకోవడం సర్వసాధారణంగా మారింది. మామూలుగా 92 శాతం ఉన్న వస్తువును అదనంగా 3-4 శాతం వేసుకుని విక్రయించాలి. అయితే వారు కొన్ని దుకాణాలను ఆసరాగా చేసుకుని 7 నుండి 8 శాతం వరకు దోచుకుంటున్నారు. ఆ రకంగా వ్యాపారులు కూడా నష్టపోతున్నారు. దీంతో వ్యాపారులు కొనుగోలుదారులపై ఆ భారాన్ని వేయక తప్పడం లేదు. మొత్తానికి కొనుగోలుదారులే నష్టపోతున్నారు.

# హామీలు అమలు చేస్తున్నాం

## త్వరలో కాల్వలకు సాగర్ జలాలు : మంత్రి సారథి


సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న మంత్రి సారథి

నూజివీడు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా సూపర్‌సిక్స్ పథకాలను అమలుపరుస్తూ కూటమి ప్రభుత్వం అటు అభివృద్ధి, ఇటు సంక్షేమ పథకాలను ముందుకు తీసుకువెళుతోందని, రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ, గృహనిర్మాణశాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత గ్యాస్‌తో పాటు తల్లికి వందనంను ఇప్పటికే అమలు చేశామన్నారు. ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్నామని, పేర్కొన్నారు. రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకం నిధులు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగర్ నుంచి జలాలను విడుదల చేయాల్సిందిగా తెలంగాణ నీటి పారుదలశాఖా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో చర్చిం చామని, త్వరలో కృష్ణానది జలాలు కాలువలకు విడుదల చేయ టం జరుగుతుందన్నారు. చింతల పూడి పథకం కోర్టు కేసుల వల్ల తీవ్ర జాప్యం జరిగిం దని, గత ప్రభుత్వం ఎన్‌జీటి సుంకం కింద రూ.76 కోట్లు కట్టాల్సి ఉండగా, అది కట్టక పోవడం, సుప్రీం కోర్టులో ఉన్న కేసులో తగు విధంగా స్పందించకపోవడంతో చింత లపూడి ఎత్తిపోతల పథకం నిలిచిందన్నారు. కోర్టు కేసులను పిర్యాదు చేసేందుకు చర్యలు తీసుకుం టున్నామని, త్వరలో చింతలపూడి ఎత్తిపోతల పథకం ను పునఃప్రారంభించి పూర్తిచేస్తామన్నారు. నూజివీడు నియోజకవర్గ పరిధి లో గత ఏడాది భారీవర్షాలకు కొట్టుకుపోయిన చెరువు కట్టల మరమ్మతులకు రూ.22 కోట్లను మంజూరు చేయటం జరిగిందని, త్వరలో మరమ్మతులు పూర్తి చేయను న్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమానంగా ముందుకు వెళుతుంటే వైసీపీకి అది కనిపించడం లేదని, కోడి గుడ్డుకు ఈకలు పీకిన చందంగా విమ ర్శలు చేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు పెట్టుబ డులను ఆహ్వానించి తాను ఇచ్చిన హామీకి అనుగు ణంగా 25 లక్షల ఉద్యోగాల కల్పనకు చర్యలు చేపడుతున్నారని, అయితే రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా వైసీపీ అసత్య ఆరోపణలు చేస్తోందన్నారు.

**పేదలకు వరం సీఎం సహాయ నిధి**

**నూజివీడు టౌన్:** ఆపదలో ఉన్న ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని మంత్రి పార్థసారథి అన్నారు. నూజివీడులోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజక వర్గపరిధిలో 49 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన 30.25 లక్షల నగదు చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. ముగ్గురు లబ్ధిదారులకు ఎల్‌వోసి కింద రూ. 4,05,842లను మంత్రి పంపిణీ చేశారు. నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, టీడీపీ ముసునూరు మండల మాజీ అధ్యక్షుడు దేవినేని ఢలరామ్, నూజివీడు, ముసు నూరు మండల టీడీపీ అధ్యక్షులు యనమదల శ్రీనివాసరావు, గద్దె రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.


ముసునూరు ఎంపీడీవో సత్యనారాయణను నిలదీస్తున్న ఉప సర్పంచ్ తదితరులు

## నిధుల అవకతవకలపై చర్యలేవీ?

ముసునూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలవల్లి గ్రామ పంచాయితీ నిధులు అవకతవకలపై సమగ్ర విచారణ చేసి నగదును రికవరీ చేయాలని ఎంపిడీవో బిపి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, స్థానికులు సంయుక్తంగా లిఖితపూర్వకంగా పిర్యాదు చేశారు. పిర్యాదు చేసి 20రోజులు గడిచిన చర్యలు తీసుకోకపోవడంతో గురువారం ఎంపిడీవోను వారు నిలదీశారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ పెద్దినేని విజయలక్ష్మి, వార్డు సభ్యుడు సరస్వతి వెంకట సత్యనారయణరాజు, టీడీపీ గ్రామ అధ్యక్షులు కాటేపల్లి సురేంద్రబాబు తదితరులు మాట్లాడుతూ 2021 నుంచి 24 వరకు సూమారు రూ 50 లక్షల నిధుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు.అప్పటి పంచాయితీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్ పిల్లి సత్యనారాయణలు కుమ్మకై వసూలు చేసిన ఇంటిపన్నులు, నీటి కుళాయి పన్నుల నగదు, ఇతర నిధులు రూ. 25 లక్షలు స్వాహా చేశారని, పనులు చేయకుండా బిల్లులు చేసుకుని సర్పంచ్ భార్యా ఖాతాకు మరో రూ. 25 లక్షలను దారి మళ్ళించారని ఆరోపించారు. వీటిపై పిర్యాదు ఇచ్చి రోజులు గడుస్తున్నా విచారణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పీఏసీఎస్ చైర్మన్‌ల ఎంపిక

ఆగిరిపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా పల్లగాని గంగాధర్‌ను నియమిస్తూ గురువారం సహకార శాఖ అధికారులు తెలిపారు. సభ్యులుగా ఉలాస మురళి, పసుమర్తి శ్రీనివాసరావు నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన మంత్రి కొలుసు పార్థసారథికి వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యాదానం.. మహాదానం

మండవల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యాదానం మహాదానం వంటిదని మనిషి చనిపోయే వరకు మన వెంట ఉండేది విద్య ఒక్కటేనని ఎంఈవో డి రామారావు పేర్కొన్నారు. మండలంలోని పెరికేగూడెం హైస్కూల్లో గురువారం వెన్నార్ సిరామిక్స్ కంపెనీ లిమిటెడ్ వారు అందించిన 1500 పుస్తకాలను ఆయన ఎంఈఓ-2 రత్న సునందంతో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న వెన్నార్ యాజమాన్యంకు ఎంఈవో రత్న సునందం కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎన్టీఆర్ ఆశయాలు మహోన్నతం


ఆలపాడులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు కామినేని, కాగిత

కైకలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆశయాలు మహోన్నతమని, తెలుగుజాతి కీర్తిని దశదిశలా చాటిన ఘనత ఆయనదేనని ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం కైకలూరు మండలం ఆలపాడులో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కామినేని మాట్లాడుతూ కిలో రెండు రూపాయిల బియ్యం పథకం తీసుకువచ్చి పేదల్లో ఆనందాన్ని నింపారన్నారు. ఈ సందర్భంగా విగ్రహ నిర్మాణ కమిటీని అభినందించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం అనేక పథకాలను తీసుకు వచ్చిన మహోన్నతుడు ఎన్టీఆర్ అని, ఆయన తీసుకువచ్చిన రిజర్వేషన్‌తోనే పెడన నియోజకవర్గానికి తాను బీసీ అభ్యర్థిగా ఎన్నికయ్యానన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కోకన్వీనర్ బొమ్మనబోయిన విజయలక్ష్మి, రాష్ట్రచేపల రైతుల సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, వడ్డి సాధికారిక సమితీ కన్వీనర్ బలే ఏసురాజు, గౌడ సంక్షేమ సంఘం నాయకులు బొర్రా చలమయ్య, సర్పంచ్ కొప్పుల కృష్ణకుమారి, ఎంపీటీసీ నల్లగచ్చు ధనలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

**ఆలపాడులో లిఫ్ ఇరిగేషన్ ఏర్పాటుచేస్తాం**

ఉమ్మడికృష్ణాజిల్లాకు శివారు ప్రాంతమైన ఆలపాడుకు నీటి ఇబ్బందులు ఎక్కువగా ఉన్నందున సమీపాన ఉన్న ఉప్పుటేరు నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుచేసి ఆక్వారైతులకు నీరు అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆలపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తక్షణ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు.

**డ్రెయిన్ల ప్రక్షాళనే లక్ష్యం**

**ముదినేపల్లి:** రాబోయే నాలుగేళ్లలో కైకలూరు నియోజకవర్గంలో ఇరిగేషన్, డ్రెయినేజీ వ్యవస్థలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి రైతులకు సాగు, మురుగు నీటి సమస్యలు లేకుండా చేయాలన్నదే తన లక్ష్యమని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. దేవపూడి గ్రామం వద్ద పెదలంక మేజర్ డ్రెయిన్‌లో పూడికతీత పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యూరియాతోపాటు పలు రకాల ఎరువుల కొరతను రైతులు ఎమ్మెల్యే కామినేని దృష్టికి తీసుకురాగా, వెంటనే జేసీ ధాత్రిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి రెండు రోజుల్లో ముదినేపల్లి మండలానికి అవసరమైన ఎరువుల సరఫరా చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. పెదగొన్నూరు డీసీ చైర్మన్ సురేష్, కైకలూరు డీసీ చైర్మన్ వాసురాజు, నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదం..

## పందిరిపల్లిగూడెం యువకుడి దుర్మరణం




చంద్రమౌళి మృతదేహం.. ఘటనా స్థలం

కైకలూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):ఐషర్ వ్యాన్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న పందిరిపల్లిగూడెం గ్రామానికి చెందిన యువకుడు మధ్యప్రదే శ్‌లోని జబల్‌పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కిరా యి నిమిత్తం వెళ్లిన భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి. కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం గ్రామానికి చెందిన కరణం చిరంజీవి చంద్రమౌళి(27) గత నెల 31న ఐషర్ వ్యాన్‌పై కిరాయి నిమిత్తం మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు వెళ్లాడు. ఘాట్ రోడ్డులో తిరిగివస్తుండగా బ్రేకులు ఫెయిలవ్వడంతో అదుపు తప్పిన వ్యాను మలుపులో డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా కొట్టింది. ప్రమాదాన్ని గుర్తించి వ్యాను నుంచి దూకే ప్రయత్నం చేయగా బలమైన ఇనుప రాడ్డు తగిలి అ పస్మారక స్థితిలోకి వెళ్లిపో యాడు. వ్యానులో ప్రయాణిస్తున్న నత్తగుల్లపా డు గ్రామానికి చెందిన క్లీనర్ ముంగర దావీదు రాజుకు రెండు కాళ్లూ నుజ్జునుజ్జయ్యాయి. చంద్రమౌళి దగ్గర్లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతి చెందిన చంద్రమౌళికి భార్య, 5, 2 సంవత్సరాల వయస్సు కలిగిన ఆడపిల్లలు ఉన్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సహకారంతో మృతదేహాన్ని రాష్ట్ర వడ్డిసాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు ఆధ్వర్యంలో స్వగ్రామానికి తీసుకొచ్చారు. వాహనం కిరాయిలు చెల్లించలేక విక్ర యించేందుకు చంద్రమౌళి బేరం పెట్టాడు. చివరి కిరాయిగా మధ్యప్రదేశ్ వెళ్లి అక్కడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషాదం నెలకొంది.

## ట్రస్టు బోర్డుకు నోటిఫికేషన్

ముదినేపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం సింగరాయపాలెం, చేవూరుపాలెం సెంటరులో వేంచేసి యున్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. తొమ్మిది మంది సభ్యులతో కూడిన ధర్మకర్తల మండలి నియామకానికి ఉత్తర్వులు జారీ అయిన 20 రోజుల్లోగా ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి తెలిపారు.


పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అగ్నికుల క్షత్రియ సంఘ నాయకులు

## ఘనంగా లక్ష్మణ స్వామి జయంతి

కలిదిండి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం సున్నంపూడిలో అగ్నికుల క్షత్రియ జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ 156వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్ మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియుల అభ్యున్నతికి పాటుపడిన లక్ష్మణస్వామి చిరస్మరణీయుడని కొనియాడారు. సంఘం నాయకులు వాటా దశరథరామ్, కొల్లాటి మార్రాజు, చిప్పల నరసింహస్వామి, సంగాని బాబురావు, పొన్నమండ చలపతిరావు, బుల్లియ్య, కొల్లాటి సత్యనారాయణ, పొన్నాల లక్ష్మణరావు వాతాడి రాంబాబులు పాల్గొన్నారు.

## చేనేతకు సాయంపై హర్షం

ముదినేపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేనేత రంగానికి చేయూత నివ్వడం హర్షణీయమని ముదినేపల్లి మండలం పెదగొన్నూరు టీడీపీ చేనేత విభాగం నాయకులు నందం సాయిబాబు, తుమ్మల చర్ల గణపతి, దొడ్డిపట్ల సుధాకృష్ణ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడుకు, నేతన్నలకు అండగా నిలుస్తున్న మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## పెయ్యేరు విద్యార్థి ప్రతిభ

ముదినేపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు ఆటోనగర్‌కు చెందిన పుప్పాల మణిదీప్ సాయి ఈ ఏడాది జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 1873 ర్యాంకు సాధించి ఐఐటీలో సీటు దక్కించుకున్నారు. ఇటీవల వెలువడిన మెయిన్స్ పరీక్షల్లో 94.5 శాతం మార్కులు సాధించటంతో ఈ విద్యార్థి ఐఐటీలో సీటు పొందేం దుకు అర్హత సాధించాడు. తనకు ఆసక్తికరమైన పెట్రోలియం గ్రూపులో సీటు రావటం సంతోషంగా ఉందని సాయి తెలిపారు. ఈ విద్యార్థి ఫొటోగ్రాఫర్ పుప్పాల శేష కుమారుడు.

## రేషన్ బియ్యం స్వాధీనం

ముసునూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుళ్ళపూడిలో అక్రమ రేషన్ బియ్యం రవాణాపై గురువారం తెల్లవారుజామున విజిలెన్స్ అధికారులు దాడి చేశారు. ఏలూరు విజిలెన్స్ సీఐ శివరామకృష్ణ, ఎస్ఐ నాగరాజు, నూజివీడు పౌర సంబంధాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన దాడిలో చాట్రాయి మండలం మర్లపాలెం గ్రామానికి చెందిన ధనికొండ గోపిరాజు వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 41 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుళ్ళపూడి పరిసర ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని కిలో రూ.14 లకు కొనుగోలు చేసి, అక్రమంగా గోపిరాజు తరలిస్తున్నాడని, వీటి విలువ రూ. 1,64,000 ఉంటుందన్నారు. అయితే ఈ బియ్యాన్ని నూజివీడుకు చెందిన బియ్యం వ్యాపారి ఖాశింబాబుకు రూ. 18 లకు విక్రయిస్తున్నట్టు విచారణలో తెలిందన్నారు. రూ. 1,64,000 విలుగల బియ్యం, రూ. 8 లక్షల విలువ గల వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమ రేషన్ బియ్యం రవాణాదారులుగా గుర్తించిన అన్నపనేనివారి గూడెంకు చెందిన కడలి లక్ష్మణరావు, బందరు నాగబాబు, కడలి లక్ష్మీ, ముసునూరు చెందిన కొల్లి కాసులు, మర్లపాలెంకు చెందిన ధనికొండ గోపిరాజు, బియ్యం వ్యాపారి ఖాశింబాబుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు.

## వృద్ధుడి అనుమానాస్పద మృతి

కలిదిండి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన పరసావానిపాలెంలో జరిగింది. మండలంలో పరసావానిపాలెంకు చెందిన పేరం సూరిబాబు (82) బుధవారం ఇంటి వెనుక అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వృద్ధుడు ఏవిధంగా చనిపోయాడన్నది పలు అనుమానాలు ఉండటంతో మనమడు జాన్ బాబు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## పాము కాటుకు ఒకరి బలి

ముసునూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పాము కాటుకు గురైన వ్యక్తి మృతి చెందిన ఘటనపై ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని సింహాద్రిపురం గ్రామానికి చెందిన చందమాల గాబ్రియేలు(45) గురువారం మధ్యాహ్నం స్థానిక గంగమ్మ చెరువులో చేపలు వేటకు వెళ్ళాడు. ఈ క్రమంలో పాము కాటు వేయడంతో దగ్గరలో ఉన్న కొంత మంది పశువులకాపరులు అతనిని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గంటల వ్యధిలోనే చికిత్స పొందుతూ గాబ్రియేలు మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.